## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు..

**మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు**

హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్: దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది. ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.


# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి:01 | సంచిక:73 | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | శుక్రవారం , అక్టోబర్,16, 2026 | పేజీలు:12 | వెల:10రూ/-


# ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి

- సీఎం చంద్రబాబు
- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక
- ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ



అమరావతి, ట్రైనెట్ న్యూస్:మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

మిగతాది 2లో

# బకాయిలు పెట్టారు

- శ్రీధర్‌బాబు స్పష్టీకరణ
- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి
- గత బీఆర్ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు
- ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన




హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్: సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే

మిగతాది 2లో

## తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం



- తెలంగాణ సీఎస్ సంజయ్ జాజు
- ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరిగాయని సీఎస్ వెల్లడి
- పంటలకు రానున్న 15-20 రోజులు కీలకం

2 లో



## కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం..

- రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!

మిగతాది 2లో



# 2050 నాటికి 20 శాతానికి పైగా చేరనున్న సీనియర్ సిటిజన్లు

- మారుతున్న ఉద్యోగ సమీకరణాలు
- భారత్‌లో భారీగా పెరుగుతున్న వృద్ధుల జనాభా
- రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగాల కోసం పెరుగుతున్న ఆసక్తి

ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:భారతదేశంలో జనాభా స్వరూపం వేగంగా మారుతోంది. దేశంలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో, పదవీ విరమణ వయసు తర్వాత కూడా ఉపాధి అవకాశాలపై కొత్తగా చర్చ మొదలైంది. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్‌ఎఫ్‌పీఏ) విడుదల చేసిన 'ఇండియా ఏజింగ్ రిపోర్ట్' ప్రకారం 2022లో దేశ జనాభాలో 10.5 శాతంగా ఉన్న 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య, 2050 నాటికి 20 శాతానికి పైగా పెరుగుతుందని అంచనా. ఈ పరిణామం సంప్రదాయ పదవీ విరమణ భావనను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది .రిటైర్మెంట్ తర్వాత కూడా పనిచేయడానికి సీనియర్ సిటిజన్లు ఆసక్తి చూపుతున్నారని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'నేషనల్ కెరీర్ సర్వీస్' పోర్టల్‌లో వృద్ధులకు అనువైనవిగా భావిస్తున్న సుమారు 1.68 లక్షల ఉద్యోగ ఖాళీలు నమోదయ్యాయి. అదే సమయంలో దాదాపు 1.89 లక్షల మంది సీనియర్ సిటిజన్లు ఉద్యోగాల కోసం ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం గమనార్హం. ఇది పని చేయడానికి వారిలో ఉన్న ఆసక్తిని, మార్కెట్లో ఉన్న అవకాశాలను సూచిస్తోంది.ప్రభుత్వ వేదికలే కాకుండా 'విజ్డమ్‌సర్కిల్' వంటి ప్రైవేట్ ప్లాట్‌ఫామ్‌లు కూడా అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్‌ను,

మిగతాది 2లో

# 'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు'..

- రాహుల్ గాంధీ ప్రవర్తనపై వివరణ కోరిన సుప్రీం
- సుప్రీంకోర్టు వరకు ర్యాలీగా వెళ్లి రాహుల్‌పై సుప్రీం అసహనం
- తన చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశం



మిగతాది 2లో

# ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్



- రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని విమర్శ
- ఓ నిర్మాణ సంస్థ ఎండీ రాసిన లేఖను విడుదల చేసిన కేటీఆర్

మిగతాది 2లో



## మతం మారితే రిజర్వేషన్ వర్తించదు..

- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- తమిళనాడు ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- 2024లో మతం మారినవారికి రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్రం ఉత్తర్వులు
- బీసీ ముస్లిం కేటగిరీలో ఏడు గుర్తింపు పొందిన సమాజాలు

మిగతాది 2లో

## విజయవాడలో జాతీయ సరస్ మేళా.. ప్రారంభించిన రాష్ట్రపతి



అమరావతి, ట్రైనెట్ న్యూస్: విజయవాడలో జాతీయ సరస్ మేళా-2026 కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్ మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్రపతి పరిశీలించారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన సహజ ఉత్పత్తులు, చేనేత వస్తువులు, హ్యాండీక్రాఫ్ట్‌లను వీక్షించారు. ఉత్పత్తుల ప్రత్యేకతలపై డ్వాక్రా మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఓ స్టాల్‌లో చీర కొనుగోలు చేసి డిజిటల్ చెల్లింపులు చేశారు.

## ఆరుతడి పంటలు వేసుకోవాలి

- సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్: ఎల్‌నినో విషయంలో శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటే పోయేలా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. ప్రజల దైనందిన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో చర్చించిన అనంతరం మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

2 లో

## విచ్ఛిన్నకర శక్తులతో జగన్ చేతులు కలిపారు: పీవీఎన్ మాధవ్



అమరావతి, ట్రైనెట్ న్యూస్:కేసులు ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడం ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ అజెండా ఏంటో స్పష్టమైందని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఎద్దేవా చేశారు. "నాడు ఆలయాల ఆస్తుల ఆక్రమణ, మత మార్పిడులను జగన్ ప్రోత్సహించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. నేడు రాజకీయ లబ్ధి కోసం దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపారు. వైకాపా పాలనలో ఎదురైన ఇబ్బందులను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదు.ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అస్థిరత, విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులతో కలిసి జగన్ సాగిస్తున్న రాజకీయ ప్రయత్నాలను వారు నిశితంగా గమనిస్తున్నారు.

# 2050 నాటికి 20 శాతానికి పైగా చేరనున్న సీనియర్ సిటిజన్లు

మొదటి పేజీ తరువాయి

వయసును కాకుండా వారి అనుభవాన్ని, నైపుణ్యాన్ని గౌరవించే ఫ్లెక్సిబుల్ ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోందనడానికి ఇది నిదర్శనం. ఇటీవల ముంబైకి చెందిన ఒక స్టార్టప్‌లో 64 ఏళ్ల వ్యక్తి ఇంటర్న్‌గా చేరడం వంటి సంఘటనలు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి.అయితే, ఈ మార్పు అంత సులభం కాదు. వయసు పెరిగిన వారు టెక్నాలజీకి అంత తొందరగా అలవాటుపడలేరని, వారికి ఎక్కువ జీతాలు ఇవ్వాల్సి వస్తుందనే కొన్ని అపోహలు నియామకాలకు అడ్డంకిగా మారుతున్నాయి. కానీ, వాస్తవానికి సీనియర్ ఉద్యోగులు తమతో పాటు అపారమైన సంస్థాగత పరిజ్ఞానం, బలమైన వృత్తిపరమైన నెట్‌వర్క్‌లు, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని తీసుకొస్తారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.పనిచేసే కాలాన్ని పొడిగించడం, శ్రామిక శక్తిలో వృద్ధుల భాగస్వామ్యాన్ని పెంచడం, ఫ్లెక్సిబుల్ రోల్స్ కల్పించడం వంటివి దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణపై భారం తగ్గడమే కాకుండా, దేశ వృద్ధికి కూడా దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో అనేక కంపెనీలు నిరంతర అభ్యాసం, దశలవారీ పదవీ విరమణ, తరం-తరం మధ్య సహకారంతో పనిచేసే బృందాలు వంటి నూతన విధానాలను అన్వేషిస్తున్నాయి. అంతిమంగా వయసును ఒక అడ్డంకిగా చూడకుండా, వారి సామర్థ్యం, అనుభవం ఆధారంగా అవకాశాలు కల్పించే పారదర్శకమైన వ్యవస్థను నిర్మించడమే అసలైన సవాలు.

# ప్రాజెక్టుల్లో సీఎంవో 15 శాతం కమీషన్

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టులో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ఏకంగా 15 శాతం కమీషన్ డిమాండ్ చేస్తోందని, ఇది అవినీతి పరాకాష్ఠ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కేవలం సొంత ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని ధ్వజమెత్తారు.తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ 2026 అక్టోబర్ 13న రాసినట్లు చెబుతున్న ఒక లేఖను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) రేడియల్ రోడ్-2 టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. సుశీ ఇన్‌ఫ్రా వంటి అర్హత కలిగిన సంస్థలను ఉద్దేశపూర్వకంగా అనర్హులుగా ప్రకటించి, ప్రభుత్వ పెద్దలకు అనుకూలమైన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముడుపులు చెల్లించిన తర్వాతే బిల్లులు విడుదల చేస్తున్నారని, ఈ కమీషన్ల దందా వల్లే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, కేవలం వ్యక్తిగత లాభం, దోపిడీపైనే దృష్టి సారించిందని మండిపడ్డారు.

# 'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు'..

మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని, ఎవరూ న్యాయవ్యవస్థను బెదిరించలేరని వ్యాఖ్యానించారు.అక్టోబర్ 12న రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ స్వయంగా సుప్రీంకోర్టుకు వెళ్లి, ఈ అంశంపై ఉమ్మడి పిటిషన్ దాఖలు చేశారు.

# బకాయిలు పెట్టారు

మొదటి పేజీ తరువాయి

సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు.

# ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి

మొదటి పేజీ తరువాయి

గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



## గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

## సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

- భూగర్భ జలమట్టాలు పడిపోవడంపై ఆందోళన
- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- ప్రతి జిల్లాకు నోడల్ అధికారులు
- సింగూరు, మంజీరా జలాశయాల నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్:** తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ప్రస్తుతం తీవ్రంగా ఉందని, 2027 ఫిబ్రవరి నాటికి అది గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలపై గణనీయమైన ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగాయని చెప్పారు.సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయాన్ని గురువారం సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తాగునీటి లభ్యత, సాగులో ఉన్న పంటల పరిస్థితిని అంచనా వేయడానికి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు వివరిం చారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో విస్తృతంగా చర్చించ నున్నట్లు వెల్లడించారు.రానున్న 15 నుంచి 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని సీఎస్ పేర్కొన్నారు. పంటలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీరు అందుబాటులో ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు.సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సీఎస్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా రూపొందించిన ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రాబోయే 15 రోజుల నీటి లభ్యతను అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ మార్పులు పంటలపై చూపే ప్రభావాన్ని వ్యవసాయ, విద్యుత్, సాగునీటి శాఖలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు, స్థానిక ప్రజలను కలిసి వారి అవసరాలను తెలుసుకోవాలని, ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# ఆరుతడి పంటలు వేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

ఎల్‌నినో విషయంలో శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నట్లు తెలిపారు. ప్రజల దైనందిన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులపై మంత్రులతో చర్చించిన అనంతరం మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## వరి సాగు వాయిదా వేసుకోండి..

"గతేడాది ఈ సమయానికి రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో కలిపి 400 టీఎంసీలకుపైగా నీళ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ నీళ్లనే పొదుపుగా వాడుకోవాలి. వచ్చే ఎనిమిది నెలలు అత్యంత కీలకం. మళ్లీ వర్షాలు వచ్చేవరకు అందరూ జాగ్రత్తగా ఉండాలి. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. హైదరాబాద్‌కు నీరందించే జలాశయాలూ ఎండిపోతున్నాయి. రైతులు పెద్దమనసు చేసుకుని.. ఒక వరి సీజన్‌ను వాయిదా వేసుకోవాలి. యాసంగిలో వరి పంట వేయొద్దు. రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.

## కేంద్రం ఆదుకోవాలి..

ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. సగటుపై అదనంగా 5 వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగింది. అక్టోబరులో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదు. మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రానికి అదనపు విద్యుత్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాం. విద్యుత్‌పై ఇచ్చే సబ్సిడీలను పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి.

## విపక్షాలు కలిసి రావాలి..

సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ వేస్తున్నాం. దసరా తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తాం. కేంద్రం నుంచి అధిక నిధులు పొందేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించాం. విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలి. ప్రకృతి విపత్తును జయించేందుకు అందరి సహకారం కావాలి. దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# మతం మారితే రిజర్వేషన్ వర్తించదు..

మొదటి పేజీ తరువాయి

- మతం మారడం వల్ల ఆ సమాజాల్లో సభ్యత్వం ఆటోమేటిక్‌గా రాదన్న హైకోర్టు

**న్యూఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారినంత మాత్రాన తమిళనాడులోని బీసీ ముస్లిం (బీసీఎం) రిజర్వేషన్ ప్రయోజనాలు పొందలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం కొట్టివేసింది.హిందూ సామాజిక వ్యవస్థ నుంచి ఇతర మత సామాజిక వ్యవస్థలోకి మారిన వ్యక్తి.. గతంలో తనకు ఉన్న సామాజిక వెనుకబాటుతనాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) కింద రిజర్వేషన్ కోరలేరని ధర్మాసనం పేర్కొన్నట్లు బార్ అండ్ బెంచ్ వెల్లడించింది. మత మార్పిడి జరిగినంత మాత్రాన గుర్తింపు పొందిన వెనుకబడిన ముస్లిం సమాజాల్లో ఏదో ఒకదానికి చెందినవారిగా పరిగణించలేమని స్పష్టం చేసింది.

## తమిళనాడు ప్రభుత్వ ఉత్తర్వు ఏంటి?

2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఓ ఉత్తర్వు జారీ చేసింది. వెనుకబడిన తరగతులు (బీసీ), అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ), డీనోటిఫైడ్ కమ్యూనిటీలు (డీఎన్‌సీ),



షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) చెందినవారు ఇస్లాంలోకి మారితే.. వారికి బీసీ ముస్లిం కేటగిరీలో కమ్యూనిటీ సర్టిఫికెట్లు ఇచ్చి రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాలని అందులో పేర్కొంది.అయితే, ఈ ఉత్తర్వును మద్రాస్ హైకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. తమిళనాడులో బీసీ ముస్లింలుగా గుర్తించిన ఏడు సమాజాల్లో సభ్యత్వం జన్మ ఆధారంగా నిర్ధారితమవుతుందని, మతం మారడం వల్ల మాత్రమే వాటిలో సభ్యత్వం లభించదని తెలిపింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.తమిళనాడులో బీసీ ముస్లిం కేటగిరీ కింద అన్సార్, దెక్కనీ ముస్లింలు, దుబేకులా, లబ్బాయిస్ (రోవ్థర్, మరక్కాయర్ సహా), మాపిళ్ల, షేక్, సయ్యద్ సమాజాలను గుర్తించారు. హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారినంత మాత్రాన వీటిలో ఏదో ఒక సమాజానికి చెందినవారిగా ధ్రువీకరించలేమని హైకోర్టు పేర్కొంది.ప్రభుత్వం మాత్రం మత మార్పిడి వల్ల సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం తొలగిపోదని వాదించింది.

# కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం..

మొదటి పేజీ తరువాయి

- నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు
- ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

**హైదరాబాద్,ట్రైనెట్ న్యూస్:** తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు.రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు.నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు.

## ఒక్కరి కోసం సొంత దేశ ప్రజలతోనే మోదీ, షా యుద్ధం: దీప్కే

**న్యూఢిల్లీ,ట్రైనెట్ న్యూస్:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ సొంత దేశ ప్రజలపైనే యుద్ధం చేస్తున్నారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న నిరసనకారులు, ప్రతిపక్ష నాయకులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. నిరసనలను అడ్డుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. న్యూఢిల్లీలో గురువారం నేహా బోరా, నటుడు ప్రకాశ్ రాజ్‌తో కలిసి దీప్కే మీడియా సమావేశంలో మాట్లాడారు. నిరసనల్లో పాల్గొంటున్న యువతను పోలీసులు రోడ్లపైకి ఈడ్చుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటానికి ఇంతమంది యువతను ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఈ సమావేశానికి ఒక రోజు ముందు సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలను న్యాయస్థానం న్యాయ నిర్బంధానికి పంపడంతో వారిని తిహార్ జైలుకు తరలించారు.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

శుక్రవారం , అక్టోబర్,16, 2026

www.trinetnews.com

# అబ్దుల్ కలాంకు రాష్ట్రపతి ముర్ము పుష్పాంజలి



**విజయవాడ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం విజయవాడలో ఆయనకు ఘన నివాళులర్పించారు. కలాం చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. జాతీయ సరస్ మేళాలో పాల్గొనేందుకు రాష్ట్రపతి విజయవాడకు విచ్చేశారు.

# ఉపకార వేతన దరఖాస్తుల పరిశీలన సకాలంలో పూర్తి చేయాలి ఎన్ఎంఎంఎస్ఎస్ అమలుపై భోపాల్‌లో ప్రాంతీయ కార్యశాల అర్హులైన విద్యార్థులకు ఏటా రూ.12 వేల ఉపకార వేతనం




**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 (ట్రైనెట్ న్యూస్):**
జాతీయ ఆర్థిక సహాయ--ప్రతిభా ఉపకార వేతన పథకం (ఎన్ఎంఎంఎస్ఎస్) కింద 2026--27 విద్యా సంవత్సరానికి విద్యార్థుల దరఖాస్తుల నమోదు, పరిశీలన ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నొక్కిచెప్పింది. అర్హులైన విద్యార్థులకు ఈ పథకం ద్వారా ఏటా రూ.12 వేల ఉపకార వేతనం అందిస్తున్నట్లు పేర్కొంది. పథకం అమలు, దరఖాస్తుల పరిశీలన విధానాలను బలోపేతం చేసేందుకు కేంద్ర పాఠశాల విద్య--అక్షరాస్యత విభాగం బుధవారం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఒకరోజు ప్రాంతీయ అవగాహన--సమీక్ష కార్యశాలను నిర్వహించింది.
ఈ సందర్భంగా పథకం అమలు పురోగతిని సమీక్షించారు. జాతీయ ఉపకార వేతన పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా పథకాన్ని నిర్వహించే విధానంపై అధికారులకు అవగాహన కల్పించారు. విద్యాసంస్థల నోడల్ అధికారులు (ఐఎన్ఓలు), జిల్లా నోడల్ అధికారులు (డీఎన్ఓలు) స్థాయిలో విద్యార్థుల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి రాష్ట్రాలు ప్రస్తావించిన సమస్యలపై చర్చించారు.

# నక్సల్ హింస బాధితులకు గౌరవప్రదమైన జీవితం కల్పిస్తాం దివ్యాంగుల పునరావాసానికి కేంద్రం అండగా ఉంటుంది బస్తర్‌లో 200కుపైగా భద్రతా శిబిరాలు సేవా కేంద్రాలుగా మార్పు: అమిత్ షా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 (ట్రైనెట్ న్యూస్):**
నక్సల్ హింసతో గాయపడిన బాధితులకు పునరావాసం కల్పించి, గౌరవప్రదంగా జీవించేలా చేయడం ప్రభుత్వ బాధ్యతని కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా అన్నారు. దివ్యాంగులు, హింస బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నక్సల్ హింస కారణంగా దివ్యాంగులైన వారు కూడా లబ్ధి పొందుతున్నారని తెలిపారు.
అక్టోబర్ 5 నుంచి 7 వరకు జగదల్‌పూర్‌లో నిర్వహించిన శిబిరం ద్వారా 3,600 మందికిపైగా దివ్యాంగులకు ప్రయోజనం చేకూరిందని షా వివరించారు. వీరిలో బస్తర్ ప్రాంతానికి చెందినవారే 1,570 మందికిపైగా ఉన్నారని, ఈ సంఖ్య ఆ ప్రాంతం అనుభవించిన బాధను తెలియజేస్తోందన్నారు. ఐదు దశాబ్దాల నక్సల్ హింస పేద ఆదివాసీ కుటుంబాలకు తీవ్ర వేదన మిగిల్చిందని పేర్కొన్నారు.
రాజకీయ లక్ష్యాల కోసం ఐఈడీ పేలుళ్లతో అమాయకులను దివ్యాంగులుగా మార్చడం తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అని విమర్శించారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించామని పేర్కొన్న ఆయన.. దాని కారణంగా ప్రజలకు మిగిలిన గాయాలను మాన్పడం కూడా అంతే అవసరమని అన్నారు. బాధితులు తిరిగి తమ కాళ్లపై నిలబడేలా అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు.
వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, ఊతకర్రలు, వినికిడి పరికరాలు, స్మార్ట్ చేతికర్రలు, కృత్రిమ అవయవాలు అందించడం ద్వారా దివ్యాంగుల రోజువారీ జీవితాన్ని సులభతరం చేయవచ్చని తెలిపారు. ఈ కృషిలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జైపూర్‌కు చెందిన భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయతా సమితి, భారతీయ జైన్ సంఘటన తదితర సంస్థల భాగస్వామ్యాన్ని అభినందించారు.
బస్తర్ ఒలింపిక్స్, బస్తర్ పండుమ్, నియద్ నెల్లనార్,



ముఖ్యమంత్రి సామూహిక బస్సు పథకం వంటి కార్యక్రమాలతో ఆ ప్రాంతంలో కొత్త ఉత్సాహం నెలకొంటోందని షా అన్నారు. ఒకప్పుడు కాల్పులు, పేలుళ్లతో భయానక వాతావరణం నెలకొన్న ప్రాంతంలో ఇప్పుడు వేలాది మంది యువత క్రీడల్లో పాల్గొంటూ తమ సంప్రదాయాలను పరిరక్షిస్తున్నారని చెప్పారు. బస్తర్ పండుమ్ ద్వారా ఆదివాసీ కళలు, సంస్కృతి పునరుజ్జీవానికి కృషి జరుగుతోందన్నారు.
సుమారు 8,526 మంది నక్సలైట్లు లొంగిపోయారని, గతంలో బ్యాంకు ఖాతాలు లేని వారిలో 7,328 మందికి ఖాతాలు తెరిచినట్లు తెలిపారు. పునరావాస చర్యల్లో భాగంగా 455 మందికి ఉద్యోగాలు, 129 మందికి భూములు కేటాయించినట్లు చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 4,014 మందికి ఇళ్లు అందాయని, 2,308 మందికిపైగా ఆదివాసీలకు నైపుణ్య శిక్షణ కల్పించినట్లు వివరించారు.
ప్రాంత అభివృద్ధిలో భాగంగా 6,763 కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, 2,808 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించామని తెలిపారు. కొత్తగా 372 రహదారి పనులు ప్రారంభించగా, 670 చిన్న వంతెనల నిర్మాణం కొనసాగుతోందన్నారు. 48,526 మందికి ఆధార్ కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు.
ఏర్పాటు చేసిన 500కుపైగా భద్రతా శిబిరాల్లో 200కుపైగా శిబిరాలను 'షహీద్ వీర్ గుండాధుర్ సేవా డేరా'లుగా మార్చనున్నట్లు అమిత్ షా ప్రకటించారు. గతంలో భద్రతా బలగాలు ప్రజలకు రక్షణ కల్పించిన ఈ శిబిరాల నుంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రజాసేవలు అందిస్తూ అభివృద్ధి చెందిన బస్తర్ నిర్మాణానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

# తాడిచెర్ల గనులు కూడా తమ కృషేనని మంత్రి వివేక్ వెంకట్ స్వామి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
సింగరేణి అంశంపై సమాచారం లేకుండా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మండిపడ్డారు. లక్ష మంది ఉద్యోగులు ఉండే సింగరేణిలో ఆ సంఖ్యను 30 వేలకు తెచ్చింది గత ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా ఒక్క గని కూడా రాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి నచ్చ చెప్పి.. వేలంలో పాల్గొని గనులు దక్కించుకున్నామని వివరించారు. తాడిచెర్ల గనులు కూడా తమ కృషేనని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే సింగరేణి సంస్థ ఆదాయం పెరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావే ఒప్పుకున్నరని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చట్టాన్ని ఎలా దుర్వినియోగం చేయాలో కేటీఆర్‌కు తెలుసునన్నారు. ఉద్యమంలో కేటీఆర్ ఆస్తులు పెరిగాయని తెలిపారు. ఆయనకు వందల ఎకరాలు ఎలా వచ్చాయో విచారణ జరగాలని అన్నారు. కేసీఆర్ రైతులను కోటీశ్వరుడిని చేస్తానని చెప్పి.. కేవలం ఆయన మాత్రమే అయ్యారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఆయన ఎలా కోటీశ్వరుడు అయ్యాడో అందరికీ చెప్పాలి కదా అని స్పష్టం చేశారు. ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ పర్యటనకు రావడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఆయన పర్యటనకు సింగరేణి నిధులు వినియోగించారనడంలో వాస్తవం లేదని పేర్కొన్నారు.
తెలంగాణ రాష్ట్రాన్ని ఫైనాన్షియల్ డిజార్డర్‌గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ కట్టడానికే తమకు సరిపోతుందని చెప్పారు. లేబర్ బోర్డుపై వస్తున్న ఆరోపణలపై మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించారు. అందుకు విజిలెన్స్ విచారణకు ఆదేశించామని తెలిపారు. దీనిపై నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
రెండు నెలల్లో విచారణ పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. నకిలీ సర్టిఫికెట్స్ విషయంలో కొందరిపై చర్యలు తీసుకున్నామని వివరించారు. 2018 నుంచి జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతుందని మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు

# ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వం అప్రమత్తం

## తాగునీటికి తొలి ప్రాధాన్యత.. పంటల రక్షణకు ప్రత్యేక చర్యలు

**సంగారెడ్డి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూగర్భ జలమట్టాల తగ్గుదల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. రాబోయే రోజుల్లో తాగునీటి అవసరాలు, పంటల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ డ్యామ్‌ను సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, ఫిబ్రవరి వరకు ఇది గరిష్ఠ స్థాయిలో కొనసాగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభావంతో ఈసారి మాన్సూన్‌పై తీవ్ర ప్రభావం పడిందని, ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగాయని వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని, ఇప్పటికే ముఖ్యమంత్రి ఈ అంశంపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. సాయంత్రం జరిగే క్యాబినెట్ సమావేశంలోనూ పరిస్థితులపై విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.

**తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత**
రాబోయే రోజుల్లో తాగునీటి లభ్యత, పంటల పరిస్థితిని సమీక్షించేందుకే సింగూర్ డ్యామ్‌ను సందర్శించినట్లు సంజయ్ జాజు తెలిపారు. భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ బోర్ల నుంచి నీరు లభించని పరిస్థితులు ఎదురయ్యే



అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. నీటి లభ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**పంటల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి**
ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రాబోయే 15 నుంచి 20 రోజులు కీలకమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. పంటలకు అవసరమైన నీటి లభ్యత, విద్యుత్ సరఫరా తదితర అంశాలను పర్యవేక్షిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, పంటలను రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**జిల్లాలకు నోడల్ అధికారులు**
ప్రస్తుత పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రతి జిల్లాకు నోడల్ అధికారులను పంపిస్తున్నట్లు సంజయ్ జాజు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, రైతులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. రాబోయే రోజుల్లో తలెత్తే నీటి ఎద్దడి, పంటల సమస్యలను ముందుగానే అంచనా వేసి తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల మార్పుల నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం సమన్వయంతో చర్యలు చేపడుతోందని సంజయ్ జాజు పేర్కొన్నారు.

# సింగరేణిపై ఆరోపణలకు మంత్రి శ్రీధర్‌బాబు ఘాటు కౌంటర్

## కొత్త గనులు తీసుకొస్తున్నాం.. సంస్థను కాపాడుతున్నాం

**బొగ్గు ఉత్పత్తి నుంచి రవాణా వరకు పటిష్ట నిఘా వ్యవస్థ.. ఆధారాలుంటే బయటపెట్టండి**
**సైట్ విజిట్ నిబంధన సంస్థ ప్రయోజనాల కోసమే..**
**దుష్ప్రచారంతో అభివృద్ధిని అడ్డుకోలేరు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, టెండర్ల ప్రక్రియ, సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర నాయకులు చేస్తున్న ఆరోపణలకు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ఘాటుగా స్పందించారు. సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడటం, కొత్త బొగ్గు గనులను సాధించడం, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ సింగరేణి కార్మికులు, అధికారుల నిజాయితీపై బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు.

**జీ-9 బొగ్గు సరఫరాపై వాస్తవాలివీ..**
సింగరేణిలో ప్రస్తుతం తొమ్మిది గనుల నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి అవుతోందని మంత్రి తెలిపారు. గత పదేళ్లలో ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏటా సగటున సుమారు 4 మిలియన్ టన్నుల జీ-9 బొగ్గు సరఫరా జరిగిందని వివరించారు. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సింగరేణి 25 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు సరఫరా చేసిందని పేర్కొన్నారు. ఇందులో జీ-9 గ్రేడ్ బొగ్గు కేవలం 1.20 మిలియన్ టన్నులు మాత్రమేనని, అందులోనూ 0.52 మిలియన్ టన్నులు తెలంగాణ జెన్‌కో విద్యుత్ కేంద్రాలకే సరఫరా చేసినట్లు వెల్లడించారు.
యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఏటా 14 మిలియన్ టన్నుల జీ-9 బొగ్గు సరఫరా చేసేలా ఇంధన సరఫరా ఒప్పందం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. సింగరేణి భవిష్యత్తులో చేపట్టనున్న కొత్త గనుల నుంచి పెరిగే ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని ఆ ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. అయితే, ఆ కొత్త గనులు ఎందుకు అందుబాటులోకి రాలేదని గత పాలకులను ప్రశ్నించారు.

**కొత్త గనులు రాకపోవడంతో ఉత్పత్తి సామర్థ్యానికి గండి**
కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనకపోవడంతో కీలకమైన కోయగూడెం-3, సత్తుపల్లి-3 బ్లాకులు సంస్థకు దక్కలేదని మంత్రి ఆరోపించారు. ఫలితంగా ఏటా దాదాపు 10 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసే అవకాశాన్ని సింగరేణి కోల్పోయిందని పేర్కొన్నారు. దాదాపు 14 గనులు మూతపడటం వల్ల మరో 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంపై ప్రభావం పడిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త గనుల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే నైనీ బొగ్గు గనికి అవసరమైన అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించిందని




వెల్లడించారు. 2013లో యూపీఏ ప్రభుత్వం మంజూరు చేసిన తాడిచెర్ల బ్లాక్-2కు మైనింగ్ అనుమతులు తీసుకొచ్చామని, వేలం ద్వారా మణుగూరు పీకే ఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికి దక్కించామని తెలిపారు. ఈ గనుల ద్వారా రానున్న రోజుల్లో సంస్థ ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**బొగ్గు మాయమయ్యే అవకాశమే లేదు**
సింగరేణికి 137 ఏళ్ల సుదీర్ఘ మైనింగ్ అనుభవం ఉందని, బొగ్గు ఉత్పత్తి నుంచి లోడింగ్, రవాణా, తూకం, తుది పంపిణీ వరకు ప్రతి దశను పర్యవేక్షించే సాంకేతికత ఆధారిత బహుళ అంచెల వ్యవస్థ అమల్లో ఉందని శ్రీధర్‌బాబు వివరించారు. ఉ్రా/జు్రా అనుసంధానం, ఊా/ఊా ద్వారా వాహనాల ట్రాకింగ్, జియో-ఫెన్సింగ్, ఎలక్ట్రానిక్ తూకం, ఆకస్మిక తనిఖీలు, బూమ్ బారియర్లు, బొగ్గు నిల్వల క్రమానుగత పరిశీలన, బొగ్గు చోరీ నిరోధక బృందాలు, నిరంతర విజిలెన్స్ చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.
ప్రతి టన్ను బొగ్గుకు లెక్క ఉండేలా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఉందని, ఇలాంటి వ్యవస్థలో బొగ్గు మాయమవుతోందంటూ చేసే ఆరోపణలకు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు, అధికారుల నిజాయితీని ప్రశ్నించే ముందు వాస్తవాలను పరిశీలించాలని సూచించారు.

**సైట్ విజిట్ నిబంధనతో పారదర్శకత**
సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను సింగరేణి సంస్థ ప్రయోజనాల కోసమే ప్రవేశపెట్టామని మంత్రి స్పష్టం చేశారు. టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు తాము చేపట్టబోయే పనుల స్థల పరిస్థితులు, భౌగోళిక స్వరూపం, స్థానిక సామాజిక అంశాలు, మౌలిక సదుపాయాలపై ముందుగానే పూర్తి అవగాహన పొందాలన్నదే ఈ నిబంధన ఉద్దేశమని వివరించారు.
గతంలో ఓవర్ బర్డెన్ తొలగింపు టెండర్లలో పాల్గొన్న కొందరు కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించకుండానే టెండర్లు దాఖలు చేసేవారని తెలిపారు. టెండర్లు దక్కించుకున్న తర్వాత వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పనులు చేయలేక మధ్యలోనే నిలిపివేయడం, పనులు వదిలేసి వెళ్లడం వంటి ఘటనలతో సింగరేణి నష్టపోయిందని పేర్కొన్నారు. ఈ సమస్యలను నివారించడంతో పాటు ఆరోగ్యకరమైన పోటీకి, పనులను సమర్థంగా పూర్తి చేయగలిగే కాంట్రాక్టర్లకు అవకాశం కల్పించేందుకే ఈ నిబంధనను అమలు చేస్తున్నట్లు చెప్పారు.
ఈ విధానం సింగరేణికే పరిమితం కాదని, జీఎండీసీ-గుజరాత్, జేఐపీసీఎల్, ఎన్ఎండీసీతో పాటు కొన్ని సోలార్ ప్రాజెక్టులు, ఈపీసీ కాంట్రాక్టుల్లోనూ అమల్లో ఉందని వివరించారు. సింగరేణిలో కూడా కోల్ ఇండియా అనుబంధ సంస్థ సీఎంపీడీఐ సలహా మేరకు 2018, 2021, 2023లో సీహెచ్‌పీల నిర్మాణం కోసం పిలిచిన టెండర్లలో సైట్ విజిట్ నిబంధనను చేర్చినట్లు గుర్తుచేశారు.
ఈ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్లు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో సరైనదిగా భావించిన నిబంధన ఇప్పుడు ఎలా తప్పవుతుందని ప్రశ్నించారు. అప్పట్లో అభ్యంతరం చెప్పని వారు ఇప్పుడు విమర్శలు చేయడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు.

**సింగరేణిని బలోపేతం చేయడమే లక్ష్యం**
సింగరేణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థ అని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. సంస్థను మరింత బలోపేతం చేసి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
గత పాలకులు బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా చేయడం వల్ల సంస్థకు కొత్త గనులు దక్కలేదని, అదే సమయంలో ప్రైవేటీకరణపై ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం కొత్త బొగ్గు గనులను సాధించడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని బ్లాకులను సంస్థకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా కీలక ఖనిజాలు, థర్మల్ విద్యుత్, సౌర విద్యుత్ రంగాల్లోనూ సింగరేణి కార్యకలాపాలను విస్తరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

**సంపదను పెంచి ప్రజలకు పంచుతాం**
గనులను కోల్పోయిన వారే సింగరేణి ప్రైవేటీకరణ గురించి మాట్లాడుతున్నారని, కొత్త గనులను సాధిస్తూ సంస్థను కాపాడేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. సింగరేణి ఆస్తులు, వనరులను సంరక్షిస్తూ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం, సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.
సింగరేణి సంపదను పెంచడం.. ప్రజలకు పంచడం.. ఇదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. దుష్ప్రచారంతో ఈ లక్ష్యాన్ని ఎవరూ అడ్డుకోలేరు"అని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

## లక్నోలో 23, 24 తేదీల్లో 'సాధన శృంఖల' కార్యశాల

### ప్రభుత్వ శిక్షణ సంస్థల ఆధునికీకరణపై చర్చ ప్రారంభించనున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

ప్రభుత్వ శిక్షణ సంస్థలను ఆధునిక, సామర్థ్య ఆధారిత సంస్థలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సామర్థ్య నిర్మాణ కమిషన్ (సీబీసీ) మూడో ప్రాంతీయ 'సాధన శృంఖల--2026' కార్యశాలను నిర్వహించనుంది. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో అక్టోబర్ 23, 24 తేదీల్లో జరిగే ఈ కార్యశాలలో ఎనిమిది రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొననున్నారు. మిషన్ కర్మయోగిలో భాగంగా ఉద్యోగుల విధులకు అనుగుణంగా శిక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై చర్చించనున్నారు.

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కార్యశాలను ప్రారంభించనున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్న ఈ కార్యక్రమానికి బిహార్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతోపాటు చండీగఢ్, ఢిల్లీ, జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు హాజరుకానున్నారు. సీనియర్ అధికారులు, శిక్షణ సంస్థల అధిపతులు, అధ్యాపకులు, విషయ నిపుణులు, పరిశ్రమల భాగస్వాములు పాల్గొంటారు.

**నాలుగు ప్రధాన అంశాలపై సంప్రదింపులు**

సంస్థాగత పాలన--నాయకత్వం, నిర్వహణ సామర్థ్యం--సంస్థల మధ్య సహకారం, అధ్యాపకులు--సంస్థల నైపుణ్యాలు, డిజిటల్ పరివర్తన అనే నాలుగు ప్రధాన అంశాలపై కార్యశాలలో చర్చించనున్నారు. శిక్షణలో కృత్రిమ మేధ వినియోగంపైనా దృష్టి సారించనున్నారు. మారుతున్న సాంకేతికత, ప్రజల అంచనాలు, అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులను సిద్ధం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలిస్తారు. ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం తమ ప్రాధాన్యాలను గుర్తించి, ఆచరణాత్మక సంస్కరణల ప్రణాళిక రూపొందించుకునేలా సహకారం అందించనున్నారు.

దేశవ్యాప్తంగా నాలుగు ప్రాంతీయ సంప్రదింపుల కార్యశాలల శ్రేణిగా 'సాధన శృంఖల'ను నిర్వహిస్తున్నారు. తొలి కార్యశాల సెప్టెంబర్ 29, 30 తేదీల్లో విజయవాడలో జరగగా, ఈశాన్య ప్రాంత కార్యశాలను అక్టోబర్ 9న గువాహటిలో నిర్వహించారు. మూడో కార్యశాలకు లక్నో వేదిక కానుంది.

**'ఉన్నతి'తో 700కు పైగా సంస్థల అనుసంధానం**

శిక్షణ సంస్థల సంస్కరణలను 'ఉన్నతి' పోర్టల్ ద్వారా ముందుకు తీసుకెళ్లనున్నారు. సాధన సప్తాహ్--2026 సందర్భంగా ప్రారంభించిన ఈ వేదిక ఇప్పటికే 700కు పైగా శిక్షణ సంస్థలను అనుసంధానిస్తోంది. సామర్థ్య నిర్మాణ ప్రణాళికల్లో గుర్తించిన అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడం, వనరులను పంచుకోవడం, పరస్పర సహకారం పెంపొందించడం, సమాచారం ఆధారంగా పనితీరును మెరుగుపరచడం దీని లక్ష్యం.

లక్నోతోపాటు ఇతర ప్రాంతీయ కార్యశాలల్లో వెలువడే సూచనలను కమిషన్ రూపొందిస్తున్న శిక్షణ సంస్థల పరివర్తన విధాన చట్రంలో పొందుపరచనున్నారు. రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులకు తగిన అవకాశం కల్పిస్తూనే సంస్కరణలకు ఉమ్మడి దిశానిర్దేశం చేయనున్నారు. మిషన్ కర్మయోగి, వికసిత్ భారత్--2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలందించే ఉద్యోగులను తయారు చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని కమిషన్ తెలిపింది.

## పరిశోధనల నుంచి ఉత్పత్తుల దిశగా అడుగులు వేయాలి సాంకేతిక ఆవిష్కరణల్లో పరిశ్రమలు భాగస్వాములు కావాలి డీప్‌టెక్ రంగాల్లో పెట్టుబడులు పెరగాలి: కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 (ట్రైనెట్ న్యూస్):**

దేశ సాంకేతిక ప్రగతిలో పరిశ్రమలు సహసృష్టికర్తలుగా ముందుకు రావాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. పరిశోధనల రూపకల్పన దశ నుంచే శాస్త్రవేత్తలతో కలిసి పనిచేస్తూ, ఆవిష్కరణలను వాణిజ్య ఉత్పత్తులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం నిర్వహించిన మూడో 'ఐఐటీకే సమన్వయ్--2026' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు--దీర్ఘకాలిక భాగస్వామ్యాలు' ఇతివృత్తంతో ఐఐటీ కాన్పూర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశోధనలను ప్రయోగశాలల నుంచి క్షేత్రస్థాయికి, ఆలోచనలను ఆచరణాత్మక ఫలితాలుగా, నమూనాలను ఉత్పత్తులుగా మార్చే ప్రక్రియ వేగవంతం కావాలని మంత్రి అన్నారు. ప్రాజెక్టుల ప్రారంభ దశలోనే వాటి వినియోగ అవకాశాలను గుర్తించడం, ఆర్థికంగా నిలదొక్కుకునే వ్యాపార నమూనాలను రూపొందించడం, ఉత్పత్తిని విస్తరించడంలో పరిశ్రమలు తోడ్పడాలని పేర్కొన్నారు.

భారత్‌లో శాస్త్రీయ ప్రతిభ, సృజనాత్మకత, ఆవిష్కరణ సామర్థ్యం సమృద్ధిగా ఉన్నాయని జితేంద్ర సింగ్ అన్నారు. వీటిని అంతర్జాతీయంగా పోటీపడే సాంకేతికతలుగా మార్చేందుకు మరిన్ని ఆర్థిక వనరులు, పారిశ్రామిక భాగస్వామ్యం అవసరమని చెప్పారు. అధునాతన సాంకేతిక రంగాల్లో దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను పెంచాలని కోరారు. పరిశ్రమల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన రూ.లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల నిధిని ప్రస్తావించారు.

శాస్త్రీయ పరిశోధనలకు దాతృత్వ సహకారం అందించడం ఆరాధనతో సమానమని మంత్రి వ్యాఖ్యానించారు. పరిశోధనలు, వైద్యపరమైన ప్రయోగాలకు అందించే ఆర్థిక సహాయం ప్రాణాలను కాపాడే చికిత్సల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్య, ఇతర సామాజిక కార్యక్రమాలతోపాటు శాస్త్ర పరిశోధనలను కూడా దాతలు సమాజసేవకు ముఖ్యమైన మార్గంగా గుర్తించాలని సూచించారు.




కృత్రిమ మేధ, క్వాంటమ్ సాంకేతికత, బయోటెక్నాలజీ రంగాల ద్వారా రాబోయే పారిశ్రామిక విప్లవానికి నాయకత్వం వహించే అవకాశం భారత్‌కు ఉందని పేర్కొన్నారు. గతంలో ఇతర దేశాల్లో అభివృద్ధి చెందిన సాంకేతికతలను అనుసరించిన భారత్.. ఇప్పుడు కొత్త సాంకేతిక పరిణామాలను రూపుదిద్దే స్థాయికి ఎదుగుతోందన్నారు. జీనోమ్ ఇండియా వంటి కార్యక్రమాలు ఇందుకు తోడ్పడుతున్నాయని చెప్పారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి అవకాశాలు కల్పించిన తరువాత స్పేస్ స్టార్టప్‌ల సంఖ్య 400 దాటిందని మంత్రి తెలిపారు. దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సుమారు 9 బిలియన్ డాలర్లుగా ఉందని, ఈ దశాబ్దం చివరికి 45 బిలియన్ డాలర్లకు చేరుతుందన్న అంచనాలు ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా స్టార్టప్‌ల సంఖ్య సుమారు 2.5 లక్షలకు చేరిందని పేర్కొన్నారు.

దేశీయ తయారీ, స్వదేశీ సాంకేతిక అభివృద్ధి, వనరుల సమర్థ వినియోగంతోనే దీర్ఘకాలిక స్వావలంబన సాధ్యమని జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. శాస్త్ర, సాంకేతిక స్వావలంబన అంతర్జాతీయ వేదికపై భారత్ స్థానాన్ని, వ్యూహాత్మక స్వతంత్రతను ప్రభావితం చేస్తుందన్నారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణువిద్యుత్ సామర్థ్యం, 2070 నాటికి నికర శూన్య ఉద్గారాల లక్ష్యాలను చేరుకోవడంలో నిరంతర ఆవిష్కరణలు కీలకమని చెప్పారు.

ఐఐటీకే సమన్వయ్ వంటి వేదికల్లో జరిగే చర్చలు దీర్ఘకాలిక భాగస్వామ్యాలు, పెట్టుబడులు, కొలవగల ఫలితాలకు దారితీయాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మణీంద్ర అగర్వాల్, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బ్రజ్ భూషణ్, రిసోర్సెస్ అండ్ అలుమ్ని డీన్ ప్రొఫెసర్ అమేయ్ కర్కరే తూదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిని భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

దేశ రాజకీయాల్లో మార్పులు వస్తున్నాయని.. ఈ మార్పులే రాహుల్ గాంధీని ప్రధాని చేస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పైన మండిపడ్డారు

సింగరేణిని రేవంత్ రెడ్డి ప్రైవేటీకరణ చేస్తారన్న కేటీఆర్ ఆరోపణలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. సింగరేణిని భ్రష్టు పట్టించింది బీఆర్ఎస్ పార్టీనేనని.. తప్పులన్నీ వాళ్లు చేసి, వాటిని తమపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారని పొంగులేటి విమర్శించారు. సింగరేణిలో 18 గనులు మూతపడడానికి కారణమైన బీఆర్ఎస్.. ఇప్పుడు మొసలికన్నీరు పెట్టుకుంటోందని విమర్శించారు.

## గిరిజన భాషల పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ

### జాతీయ గిరిజన భాషా భాండాగారంగా 'ఆది వాణి' నమోదు, డిజిటల్ సంరక్షణ, మాతృభాష బోధనపై నిపుణుల చర్చ

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

దేశంలోని గిరిజన భాషల నమోదు, పరిరక్షణ, పరిశోధన, ప్రోత్సాహానికి సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గిరిజన భాషలపై ఏర్పాటు చేసిన కార్యబృందం తొలి సమావేశాన్ని గురువారం ప్రత్యక్ష, ఆన్‌లైన్ విధానాల్లో నిర్వహించింది. మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజనా చోప్రా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భాషావేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, గిరిజన సమాజాల్లో భాషల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనులకు సంక్షేమ పథకాలను సమర్థంగా చేరవేయడంలో వారి భాషలు కీలకమని రంజనా చోప్రా పేర్కొన్నారు. అనువాద సాధనంగా ప్రారంభమైన 'ఆది వాణి'ని భాషా సమాచార సేకరణలు, ప్రాథమిక పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు, సామాజిక కథనాలతో కూడిన సమగ్ర జాతీయ గిరిజన భాషా భాండాగారంగా అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. చిన్నతరగతుల్లో అభ్యసన అంతరాలను తగ్గించేందుకు మాతృభాష ఆధారిత బహుభాషా విద్య అవసరమని చెప్పారు. వివిధ సంస్థలు, పరిశోధకులు ఇప్పటికే చేసిన కృషిని ఒకే వేదికపైకి తీసుకురావాలని సూచించారు.

**తొమ్మిది భాషల్లో అనువాద సేవలు**

మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐటీ ఢిల్లీ అభివృద్ధి చేసిన 'ఆది వాణి' పురోగతిని సమావేశంలో సమీక్షించారు. ఈ వేదిక తొమ్మిది గిరిజన భాషల్లో పాఠ్య అనువాదంతోపాటు వాక్కు సంబంధిత సేవలు, చిత్రాల్లోని అక్షరాలను గుర్తించే ఓసీఆర్, వీడియోలకు ఉపశీర్షికలు జోడించే సదుపాయాలను అందిస్తోంది. గిరిజన పరిశోధనా సంస్థలు రూపొందించిన 300కు పైగా ప్రాథమిక పాఠ్యపుస్తకాలను ఇందులో



శోధించవచ్చు.

రాష్ట్రాల గిరిజన పరిశోధనా సంస్థలు పది భాషల్లో సుమారు 13.9 లక్షల వాక్యాలు, దాదాపు 300 గంటల వాక్కు సమాచారాన్ని అందించాయి. ఈ వేదికకు ఆండ్రాయిడ్‌లో 48 వేలకు పైగా డౌన్‌లోడ్లు నమోదుకాగా, నెలకు సుమారు 6,500 మంది వినియోగిస్తున్నారు. భాషా సమాచార ప్రామాణికత నిర్ధారణ, అక్షరరూపాలు--రాతపద్ధతుల ప్రామాణీకరణ, వివిధ రంగాలకు అవసరమైన పదజాలం అభివృద్ధికి కార్యబృందం సహకారాన్ని ఐఐటీ ఢిల్లీ కోరింది.

**భాషాభివృద్ధిలో సమాజానిదే ప్రధాన పాత్ర**

భాషా సమితి చైర్మన్ పద్మశ్రీ చాము కృష్ణశాస్త్రి మాట్లాడుతూ మాతృభాషపై పట్టు, విద్య--పరిపాలన--వినోద రంగాల్లో వినియోగం, సమకాలీన సాహిత్యం, కొత్త పదాల సృష్టి, సాంకేతిక పరిజ్ఞానం, బోధన సామగ్రి, ప్రభుత్వాలు--సమాజం సహకారం భాషాభివృద్ధికి కీలకమని వివరించారు. భాష మాట్లాడే ప్రజలే అభివృద్ధి ప్రయత్నాలకు కేంద్రంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ భాషనూ చిన్నదిగా లేదా పెద్దదిగా చూడకుండా పరస్పర గౌరవంతో భాషా వైవిధ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

సాహిత్య అకాడమీ మాజీ కార్యదర్శి డాక్టర్ కె. శ్రీనివాసరావు గిరిజన భాషల నమోదు, పునరుజ్జీవనానికి పలు ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రాలు, భాషలవారీగా రచయితలు, పరిశోధకులు, వనరుల వివరాలతో జాతీయ సమాచార నిధిని రూపొందించాలని సూచించారు. గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి జిల్లా స్థాయిలో పరిశోధన బృందాలు ఏర్పాటు చేయాలని, 'ఆది వాణి' ద్వారా సామాజిక డిజిటల్ భాండాగారాలను అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. త్రైమాసిక సమీక్షలతో రెండేళ్ల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ప్రతిపాదించారు.

**ఏకలవ్య పాఠశాలల్లో వినియోగానికి అవకాశం**

దేశవ్యాప్తంగా 1.7 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్న 525కు పైగా ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో 'ఆది వాణి'ని బోధనకు వినియోగించవచ్చని జాతీయ గిరిజన విద్యార్థుల విద్యా సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కథలు, కవితలు, ఇతర రచనలను అందించడం ద్వారా ఈ భాండాగారాన్ని మరింత సమృద్ధిగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.

గిరిజన భాషల పటం రూపొందించడం, ప్రాంతాలవారీ సమన్వయ బృందాల ఏర్పాటు, మౌఖిక సంప్రదాయాల డిజిటల్ నమోదు, పాఠశాల పాఠ్యాంశాలకు అవసరమైన సాంకేతిక పదజాలం అభివృద్ధిపై నిపుణులు సూచనలు చేశారు. సభ్యులు తమ వద్ద ఉన్న భాషా వనరుల వివరాలను అందించాలని రంజనా చోప్రా కోరారు. వాటిని ఐఐటీ ఢిల్లీ సమన్వయంతో వేదికలో అనుసంధానించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. గిరిజన సమాజాల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే భాషా వనరుల యాజమాన్యం ఆయా సమాజాలకే కొనసాగాలని స్పష్టం చేశారు.

## ఉగ్రదాడులకు మరింత గట్టి సమాధానం: రాజ్‌నాథ్ సింగ్

### శాంతి పట్ల నిబద్ధతను బలహీనతగా భావించొద్దని హెచ్చరిక ఆధునిక సాంకేతికతతో 'స్మార్ట్ పవర్'గా ఎదగాలని పిలుపు

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

పాకిస్థాన్ నుంచి ఉద్భవించే ఉగ్రదాడులకు భారత్ మరింత బలమైన సమాధానం ఇస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్, బాలాకోట్ వైమానిక దాడులు, సర్జికల్ స్ట్రైక్స్ కేవలం సైనిక చర్యలు మాత్రమే కాదని, ఉగ్రవాదాన్ని దాని మూలాల్లోనే నిర్మూలించే దిశగా భారత వైఖరిలో వచ్చిన నిర్ణయాత్మక మార్పునకు ప్రతీకలని పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన రక్షణ సదస్సులో ఆయన ప్రసంగించారు.

చర్చలు, సహజీవనం, వివాదాల శాంతియుత పరిష్కారానికే భారతదేశం ప్రాధాన్యం ఇస్తుందని రాజ్‌నాథ్ తెలిపారు. అయితే శాంతి పట్ల దేశ నిబద్ధతను బలహీనతగా భావించరాదని హెచ్చరించారు. దేశ సార్వభౌమత్వం, సమగ్రత, జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శాంతిని నిలబెట్టేందుకు బలం, సామర్థ్యం అవసరమని అభిప్రాయపడ్డారు.

**మారుతున్న ఉగ్రవాద ముప్పుపై అప్రమత్తత**

డిజిటల్ యుగంలో భద్రతా సవాళ్లు మరింత సంక్లిష్టమవుతున్నాయని రక్షణ మంత్రి పేర్కొన్నారు. తప్పుడు సమాచార వ్యాప్తి, అస్థిరత సృష్టించడం, వ్యవస్థలకు అంతరాయం కలిగించడం, మోసం, విధ్వంసాన్ని '5డీ భద్రతా ముప్పు'గా వివరించారు. ఉగ్రవాదం వ్యవస్థీకృత ముఠాలకే పరిమితం కావడం లేదని, ఒంటరిగా దాడులకు పాల్పడే వ్యక్తులు, 'వైట్ కాలర్ ఉగ్రవాదం' వంటి కొత్త ముప్పులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రయాణికుల విమానాన్ని కూల్చేందుకు సహ పైలట్ ప్రయత్నించారన్న ఆరోపణలు వచ్చిన ఘటనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రమాదాన్ని నివారించేందుకు కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రాణాలకు



తెగించి వ్యవహరించారని కొనియాడారు. అప్రమత్తత, ధైర్యం కలిగిన ఒక్క వ్యక్తి కూడా ఉగ్రకుట్రను భగ్నం చేయగలరని అన్నారు. ఉగ్రవాద నిర్మూలనలో భద్రతా సంస్థలతోపాటు బాధ్యతగల పౌరుల భాగస్వామ్యం అవసరమని స్పష్టం చేశారు.

**కృత్రిమ మేధతో రక్షణ సామర్థ్యం**

ఆధునిక భద్రతా అవసరాలకు అనుగుణంగా సైనిక శక్తి, దౌత్య--సామాజిక ప్రభావాన్ని సమన్వయం చేసే 'స్మార్ట్ పవర్' విధానాన్ని అనుసరించాలని రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు. కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు, లక్ష్య ప్రాంతంలో సంచరిస్తూ దాడిచేసే మందుగుండు వ్యవస్థలతోపాటు తక్కువ ఖర్చుతో సమర్థంగాపనిచేసేసాంకేతికతలనువినియోగించాలన్నారు. మానవ నిఘాకు కృత్రిమ మేధను జోడించడం ద్వారా మారుతున్న సవాళ్లను ఎదుర్కోవాలని సూచించారు.

ఆపరేషన్ సిందూర్‌లో ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, బ్రహ్మోస్ వంటి స్వదేశీ రక్షణ వ్యవస్థలు దేశ సాంకేతిక సామర్థ్యాన్ని చాటాయని తెలిపారు. సాయుధ దళాల ఆధునికీకరణ బడ్జెట్‌లో 75 శాతాన్ని దేశీయ పరిశ్రమల నుంచి కొనుగోళ్లకు కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, అంకుర సంస్థలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు జాతీయ రక్షణలో భాగస్వాములవుతున్నాయని పేర్కొన్నారు.

**రూ.1.78 లక్షల కోట్లు దాటిన రక్షణ ఉత్పత్తి**

దేశ రక్షణ ఉత్పత్తి విలువ 2014లో రూ.40 వేల కోట్లుగా ఉండగా, ప్రస్తుతం రూ.1.78 లక్షల కోట్లకు పైగా చేరిందని రాజ్‌నాథ్ వెల్లడించారు. రక్షణ ఎగుమతులు 2013--14లో రూ.686 కోట్ల నుంచి రూ.39 వేల కోట్లకు పెరిగాయని తెలిపారు. భారత రక్షణ ఉత్పత్తులు దాదాపు 100 దేశాలకు చేరుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది రూ.2 లక్షల కోట్లు, 2029 నాటికి రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తిని సాధించడంతోపాటు, 2029 నాటికి ఎగుమతులను రూ.50 వేల కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

సాయుధ దళాలు వినియోగించే 175 రకాల మందుగుండు సామగ్రిలో 159 రకాలను దేశీయంగానే ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. స్వదేశీకరణ కోసం రక్షణ దళాలు 509 అంశాలతో ఐదు జాబితాలను విడుదల చేశాయని, ఆరో జాబితా విడుదలకు సిద్ధమవుతోందని చెప్పారు. రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు గుర్తించిన 5,012 అంశాల్లో 3,255 అంశాల స్వదేశీకరణ పూర్తయిందని పేర్కొన్నారు.

పరిశోధన, ఆవిష్కరణలకు ఐడెక్స్, ఐడెక్స్ ప్రైమ్, అదితి పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని రాజ్‌నాథ్ తెలిపారు. అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈల నుంచి రూ.2,400 కోట్లకు పైగా వస్తువులు, సేవల కొనుగోళ్లకు ఆమోదం తెలిపామని, కొత్త సాంకేతికతల అభివృద్ధికి రూ.1,500 కోట్లకు పైగా ప్రాజెక్టులను మంజూరు చేశామని వివరించారు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగి సాంకేతికత, ఆర్థిక వ్యవస్థ, రక్షణ రంగాల్లో ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## వినూత్న కార్యక్రమాలతో ప్రత్యేక ప్రచారం--6కు ఊపు

### 84 మంత్రిత్వ శాఖలు, విభాగాల పురోగతిపై సమీక్ష డిజిపోస్ట్, ఈ--వ్యర్థాల సేకరణ, వ్యర్థాలతో కళాకృతులకు ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, పెండింగ్ అంశాల పరిష్కారం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ప్రచారం--6 వేగంగా సాగుతోంది. కార్యక్రమం అమలు పురోగతిపై పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) కార్యదర్శి నివేదితా శుక్లా వర్మ అధ్యక్షతన మూడో సమీక్ష సమావేశం నిర్వహించారు. 84 మంత్రిత్వ శాఖలు, విభాగాలు, వాటి ప్రభుత్వ రంగ సంస్థలు, క్షేత్రస్థాయి కార్యాలయాలకు చెందిన 600 మందికి పైగా అధికారులు 240కు పైగా ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

సెప్టెంబర్ 30న సన్నాహక దశ పూర్తికాగా, అక్టోబర్ 2న ప్రారంభమైన అమలు దశ ఈ నెల 31 వరకు కొనసాగనుంది. తొలి రెండు వారాల్లో వివిధ శాఖలు చేపట్టిన వినూత్న, ప్రజా ప్రయోజన కార్యక్రమాలను డీఏఆర్‌పీజీ అదనపు కార్యదర్శి పునీత్ యాదవ్ సమావేశంలో వివరించారు.

ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఒకరోజు కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రిత్వ శాఖలు తమ అనుబంధ, అధీన, క్షేత్రస్థాయి కార్యాలయాలన్నింటిలో ఒకే రోజు పరిశుభ్రత, పెండింగ్ అంశాల పరిష్కార చర్యలు చేపడుతున్నాయి. దీనివల్ల క్షేత్రస్థాయిలో కార్యక్రమ పరిధి, భాగస్వామ్యం పెరుగుతున్నట్లు సమావేశం పేర్కొంది.

**ప్రజాసేవలకు సాంకేతికత తోడ్పాటు**

తపాలా శాఖ ప్రారంభించిన 'డిజిపోస్ట్' ద్వారా గుజరాత్ పోలీసులు జారీ చేసే ట్రాఫిక్ ఈ--చలాన్లను డిజిటల్‌గా పంపించి, వాటి భౌతిక ప్రతులను ప్రజలకు అందిస్తున్నారు. రక్షణ శాఖ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి 'ఈ--ఛావణి' సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రైల్వే అంశాలపై యువత, విద్యార్థులు, ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ 'రైల్ జన్ యువ సంవాద్' నిర్వహించింది.

ఈ--వ్యర్థాల సేకరణకు ప్రత్యేక చర్యలు

బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎంసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఈ--వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు క్షేత్రస్థాయి కార్యాలయాల్లో సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. గనుల మంత్రిత్వ శాఖ జీపీఓఏ--3 భవనంలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి, వినియోగం తగ్గించడం, పునర్వినియోగం, రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించింది. ఐఐటీ అలహాబాద్‌లో కాలం చెల్లిన ఎలక్ట్రానిక్ పరికరాలను వేరుచేసి సేకరించారు. పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం కూడా ఈ--వ్యర్థాల సేకరణ చేపట్టింది.

వ్యర్థాలతో కళాకృతులు.. ఉపయోగకర వస్తువులు

సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పారవేసిన ప్లాస్టిక్ చెంచాలు, కాగితంతో నెమలి ఆకృతిని రూపొందించింది. పాత కంప్యూటర్ విడిభాగాలు, గృహ వ్యర్థాలతో 'రీ--బాట్' రోబో శిల్పాన్ని తయారు చేసింది. రైల్వే మ్యూజియంలో 'వేస్ట్ టు ఆర్ట్ పార్క్'ను అభివృద్ధి చేయగా, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ--వ్యర్థాలతో పనిచేసే చరఖాను రూపొందించింది.

శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన విభాగం కాలం చెల్లిన రికార్డులను సమీక్షించి, తొలగించాల్సిన వాటిని ధ్వంసం చేసే చర్యలు చేపట్టింది. పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోని నుమాలిగఢ్ రిఫైనరీ పరిశుభ్రతపై ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించి కార్మికులకు స్వచ్ఛత కిట్లు పంపిణీ చేసింది. అస్సాం రైఫిల్స్ స్థానిక ప్రజల భాగస్వామ్యంతో చెత్తను వేరుచేయడం, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించింది.

కార్యక్రమాలకు ముద్రణ, ప్రసార, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. వివిధశాఖలు # SpecialCampaign6 హ్యాష్‌ట్యాగ్‌తో తమ కార్యక్రమాలను పంచుకోవడంతోపాటు పత్రికా సమాచార కార్యాలయం ద్వారా ప్రకటనలు విడుదల చేస్తున్నాయి.

# రాష్ట్రపతి ముర్ము జీవితం ప్రతి మహిళకు స్ఫూర్తి: ముఖ్యమంత్రి చంద్రబాబు



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

లవిజయవాడ:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ప్రాంతమైన విజయవాడలో నిర్వహించిన 'సరస్ మేళా' మహిళా శక్తిని చాటేందుకు ఎంతగానో దోహదపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పొదుపు సంఘాల స్థాయి నుంచి మహిళలు ఎదిగి, భవిష్యత్తులో పెద్ద వ్యాపార సంస్థలుగా మరియు అంతర్జాతీయ బ్రాండ్లుగా నిలదొక్కుకోవాలని ఆయన మహిళలకు పిలుపునిచ్చారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట:**

ఇదివరకు కేవలం ఢిల్లీలోనే పరిమితమైన ఈ ప్రతిష్టాత్మక 'సరస్ మేళా'ను ఈసారి విజయవాడలో నిర్వహించడం ఏపీకి దక్కిన గొప్ప శోభ అని సీఎం చంద్రబాబు తెలిపారు. దేశ ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవిత ప్రయాణం ప్రతి ఒక్క మహిళకు నిత్య స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. అంకితభావం, సంకల్ప బలం ఉంటే మహిళలు ఏ రంగంలోనైనా సరే అత్యున్నత శిఖరాలను అధిరోహించగలరని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

# ఏపీ హైకోర్టులో వైయస్సార్‌సీపీ లంచ్ మోషన్ పిటిషన్: అభ్యర్థుల కేసుల వివరాలపై అత్యవసర విచారణ



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

లఅమరావతి:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరియు న్యాయపరమైన అంశాలలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర హైకోర్టులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తరఫున అత్యవసరంగా ఒక లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయబడింది. రాజకీయంగా మరియు న్యాయపరంగా ప్రాధాన్యత సంతరించుకున్న ఈ పరిణామంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**పిటిషన్ ప్రధాన ఉద్దేశ్యం:**

రాబోయే ఎన్నికలు లేదా పోటీ ప్రక్రియలో భాగంగా పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన వివిధ కేసుల వివరాలను కేవలం 24 గంటల వ్యవధిలోనే పూర్తిగా అందించాలని కోరుతూ ఈ లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేయడం జరిగింది. అభ్యర్థులపై ఉన్న కేసుల సమచార సేకరణ మరియు దానికి సంబంధించిన నిబంధనలపై స్పష్టత కోరుతూ ఈ అత్యవసర పిటిషన్‌ను కోర్టు ముందుకు తీసుకొచ్చారు.

**హైకోర్టు విచారణ అనుమతి:**

వైసీపీ తరఫున దాఖలైన ఈ లంచ్ మోషన్ పిటిషన్ యొక్క ప్రాధాన్యతను గుర్తించిన ఏపీ హైకోర్టు దీనిని విచారణకు స్వీకరించడానికి అంగీకరించింది. ఈ తరుణంలో, ఈ పిటిషన్‌పై హైకోర్టు మరికాసేపట్లో అత్యవసర విచారణ జరపనుంది. ఈ విచారణకు సంబంధించి న్యాయస్థానం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేస్తుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది

# జగిత్యాల టీఆర్ నగర్‌లో బోనాల పండుగకు ముఖ్య అతిథిగా,అర్బన్ కాలనీలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, టౌన్ హాల్‌లో బోనాల వేడుకలకు






ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

జగిత్యాల పట్టణంలో బోనాల పండుగ, దుర్గా నవరాత్రుల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు.

టీఆర్ నగర్‌లో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల అర్బన్ కాలనీలో దుర్గా నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే టౌన్ హాల్‌లో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవడం సంతోషకరమని అడువాల జ్యోతి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మొహమ్మద్ చాంద్ పాషా, భగవత్ బాంధవులు, తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల క్యాశిప్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి,సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన కొండాడి కవితకు కళ్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన రూ. 1,00,116 విలువైన చెక్కును జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ అందజేశారుఅలాగే సారంగాపూర్ మండలం లచ్చకపేట గ్రామానికి చెందిన జంగం కోమురయ్యకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 30,000 విలువైన చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డా. సంజయ్ కుమార్ అందజేశారు.

ఈ సందర్భంగాఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. పేద,మధ్యతరగతికుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలోఎన్ఆర్ఐ సెల్ మెంబర్ మంద భీమ్ రెడ్డి,రాయికల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు,కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్,సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్ చీటి లక్ష్మీనారాయణ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం.. సరైన పత్రాలు లేదా నంబర్ ప్లేట్లు లేని 24 వాహనాలు గుర్తింపు.





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

మహబూబాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గూడూరు సర్కిల్ పరిధిలోని కొత్తగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌతుగూడెం, చింతగట్టు తండా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో 35 మంది పోలీసు సిబ్బంది పాల్గొని సుమారు 120 ఇళ్ల పరిధిలో తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేదా నంబర్ ప్లేట్లు లేని 24 వాహనాలను గుర్తించారు. అలాగే 15 లీటర్ల అక్రమ మద్యం (గుడుంబా), సుమారు 500 లీటర్ల బెల్లం వాష్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రోడ్డు భద్రత, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపైఅవగాహనకల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల నివారణ, పోలీస్--ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతం, ప్రజల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్లు గూడూరు సీఐ వినయ్ తెలిపారు.

# జగిత్యాల టీఆర్ నగర్‌లో బోనాల పండుగకు ముఖ్య అతిథిగా,అర్బన్ కాలనీలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, టౌన్ హాల్‌లో బోనాల వేడుకలకు – హాజరైన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్







ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

జగిత్యాల పట్టణంలో బోనాల పండుగ, దుర్గా నవరాత్రుల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. టీఆర్ నగర్‌లో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల అర్బన్ కాలనీలో దుర్గా నవరాత్రుల సందర్భంగా నిర్వహించినఅన్నదానకార్యక్రమంలోపాల్గొన్నారు. అలాగే టౌన్ హాల్‌లో నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగాప్రజలందరూసుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవడం సంతోషకరమని అడువాల జ్యోతి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మొహమ్మద్ చాంద్ పాషా, భగవత్ బాంధవులు, తదితరులు పాల్గొన్నారు

# సౌదీ అరేబియా జిజాన్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎకిన్ పూర్ కాశిరెడ్డి రాకేష్ మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి పంపించేందుకు సాటా రియాద్ కృషి





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

సౌదీ అరేబియాలోని జిజాన్ ప్రాంతం జరిగిన ఘోర ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం, జగిత్యాల జిల్లాకు చెందిన యువకుడు కాశిరెడ్డి రాకేష్ మృతి చెందారు. ఆయన జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం,యాకీనిపూర్‌గ్రామానికి చెందినవారు. రాకేష్ సౌదీ అరేబియాలో రిగ్గర్‌గా, అంటే భారీ పరికరాలు మరియు యంత్రాల సహాయంతో బరువైన వస్తువులను ఎత్తడం, తరలించడం వంటి పనులు చేసే కార్మికుడిగా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా జీఆర్‌పీ పైపుల మార్గం వద్ద పనిచేస్తున్న సమయంలో క్రేన్‌కు సంబంధించిన ప్రమాదం చోటుచేసుకుంది

ఈ ప్రమాదంలో పైపు ఆయనపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.

"కుటుంబానికి అండగా సాటా రియాద్"

ఈవిషాదఘటనకు సంబంధించిన సమాచారాన్ని అదే ప్రాంతంలో నివసిస్తున్న, రాయికల్‌కు చెందిన దాసరి శ్రీనివాస్ ద్వారా సౌదీ అరేబియా తెలుగు సంఘం రియాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ మచ్చకి తెలిపారు

సమాచారం అందుకున్న వెంటనే శ్రీనివాస్ మచ్చ స్పందించి, భారతదేశంలో ఉన్న మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో సౌదీ అరేబియా తెలుగు సంఘం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

అదేవిధంగా, తెలంగాణ ప్రవాస భారతీయుల సలహా మండలి ఉపాధ్యక్షులుమందా భీమారెడ్డి తో కూడా మాట్లాడి, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించే అంశంపై సమన్వయం చేస్తున్నారు.

**"మృతదేహాన్ని స్వదేశానికి పంపించేందుకు సాట చర్యలు"**



మృతుడు రాకేష్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తరలించేందుకు భారత రాయబార కార్యాలయం, రియాద్,భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం, జెడ్డాతో సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు చేపట్టేందుకు శ్రీనివాస్ మచ్చ కృషి చేస్తున్నారు.

ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ, మృతదేహాన్ని త్వరగా భారతదేశానికి పంపించేందుకు తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

"సాటా నాయకుల ప్రగాఢ సంతాపం"

రాకేష్ మృతి పట్ల సౌదీ అరేబియా తెలుగు సంఘం వ్యవస్థాపకులు మల్లేషన్, రియాద్ అధ్యక్షులు శ్రీనివాస్ మచ్చ, సర్వాణి విద్యాధరణి సౌదీ అరేబియా కార్యవర్గ ప్రధాన సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సంఘం తరఫున కృషి చేస్తామని శ్రీనివాస్ మచ్చ భరోసా ఇచ్చారు

అలాగే, ఈ విషయంలో అవసరమైన సహకారం అందిస్తున్న భారత రాయబార కార్యాలయం రియాద్, భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంజెడ్డా, తెలంగాణ ప్రభుత్వానికి సౌదీ అరేబియా తెలుగు సంఘం తరఫున శ్రీనివాస్ మచ్చ , వ్యవస్థాపకులు శ్రీ మల్లేషన్ కృతజ్ఞతలు తెలిపారు.

మృతుని కుటుంబానికి సౌదీ అరేబియా తెలుగు సంఘం రియాద్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారికి అండగా నిలుస్తుందని స్పష్టం చేసింది.

సౌదీ అరేబియా తెలుగు సంఘం, రియాద్ శ్రీనివాస్ మచ్చ తెలిపారు

# సోమన్నపల్లిగీతపారిశ్రామికసహకార సంఘసభ్యులుఎల్లమ్మఆలయఅభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు వినతి





ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

జగిత్యాలమండలం సోమన్నపల్లి గ్రామానికి చెందిన గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారుఈ సందర్భంగా సోమన్నపల్లి గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద కళ్యాణ మండపం నిర్మాణానికి, అలాగే ఎల్లమ్మ గుడి ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్కి వినతి పత్రాన్ని అందజేశారు.

ఎమ్మెల్యేవారి వినతిని సానుకూలంగా పరిశీలించి ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు

ఈ కార్యక్రమంలో సోమన్ పల్లి, సంఘం పల్లి గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## హిందూపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వైసీపీ నేతల నిరసన: అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

హిందూపురం:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హిందూపురంలో రెవెన్యూ అధికారుల తీరుపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికారుల తీరులో వస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఎండగడుతూ వారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం వెళ్లి:హిందూపురం తహశీల్దార్ కార్యాలయానికి క్యాస్ట్, ఇన్ కమ్ సర్టిఫికెట్ల (కుల మరియు ఆదాయ ధృవీకరణ పత్రాలు) కోసం వైసీపీ నేతలు వెళ్లగా, అక్కడ అధికారుల నుంచి తీవ్ర నిర్లక్ష్యం ఎదురైందని వారు ఆరోపించారు. కార్యాలయ వేళల్లో బాధ్యతాయుతమైన అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందిని గుర్తించి, నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయం ఎదుట నిరసన మరియు తీవ్ర ఆరోపణలు:



అధికారుల గైర్హాజరు మరియు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ వైసీపీ నాయకులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులు కావాలనే ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికార తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నేతల కనుసన్నల్లోనే అధికారులు పనిచేస్తున్నారని వైసీపీ నేతలు ఈ సందర్భంగా తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

## పసుపు సాగుతో రైతుకు సిరులు: ఎకరాకు రూ. 2 లక్షల నికర లాభం సాధించి ఆదర్శంగా నిలిచిన అన్నదాత



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

ప్రకాశం జిల్లా:ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సాగు ఖర్చులు, పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించక అన్నదాతలు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, ప్రకాశం జిల్లాకు చెందిన ఒక ఆదర్శ రైతు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని నిరూపించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**ఆధునిక పద్ధతులు మరియు మార్కెటింగ్ వ్యూహాలు:**

ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు రవీందర్ రెడ్డి పసుపు సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడంతో పాటు, సరైన మార్కెటింగ్ వ్యూహాలను అనుసరిస్తూ ముందుకు వెళు న్నారు. దీనివల్ల ఆయన తన పొలంలో పసుపు సాగు చేస్తూ ఎకరాకు ఏకంగా రూ. 2 లక్షల వరకు నికర లాభాన్ని ఆర్జిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు.

**వ్యవసాయంలో లాభదాయక మార్పు:**

మొక్కజొన్న వంటి సాధారణ పంటలతో పోలిస్తే, పసుపు సాగు చేయడం ద్వారా తగిన లాభాలు పొందవచ్చని రైతు రవీందర్ రెడ్డి తన ఆచరణ ద్వారా స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని నష్టాల బాట నుంచి లాభాల బాటలోకి ఎలా మార్చుకోవాలో తెలుసుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల రైతులు సైతం ఆయనను ఆదర్శంగా తీసుకుని పసుపు సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

## మాచర్ల నియోజకవర్గంలో జడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లు: స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ వి. సంజన సింహ



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

మాచర్ల:పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. సంజన సింహ గురువారం స్వయంగా తనిఖీ చేశారు.

భద్రతా ఏర్పాట్లు మరియు మౌలిక వసతుల పరిశీలన:

స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్ కౌంటర్లు మరియు ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రాలలో నిరంతరం నిఘా ఉంచేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును సమీక్షించారు. అగ్నిప్రమాదాల నివారణకు ఉద్దేశించిన అగ్నిమాపక పరికరాల సిద్ధతను పరిశీలించారు. సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు మరియు విద్యుత్ సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ఎటువంటి లోపాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ముగిసేలా అధికారులు పూర్తి అప్రమత్తతో వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

## హైదరాబాద్ సీబీఐ కోర్టులో సంచలనం: వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుల్లో జోరుగా రోజూవారీ విచారణ ప్రారంభం



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

**హైదరాబాద్:**

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అత్యంత సంచలనాత్మకంగా మారిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని ప్రత్యేక సీబీఐ కోర్టులో వైఎస్ జగన్ అక్రమాస్తులకు సంబంధించిన కేసుల విచారణను అధికారికంగా రోజూవారీ (డే-టూ-డే) ప్రాతిపదికన గురువారం నుంచి ప్రారంభించారు.

**ఈడీ చార్జ్‌షీట్లు మరియు కేసుల వివరాలు:**

ఈ కీలక విచారణలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గతంలో నమోదు చేసి దాఖలు చేసిన మొత్తం తొమ్మిది చార్జ్‌షీట్లపై న్యాయస్థానం దృష్టి సారించి విచారణ జరుపుతోంది.

ముఖ్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నమోదైన ప్రధానమైన మూడు ఈడీ (ఈడీ) కేసులకు సంబంధించి ఈ విచారణ అత్యంత తీవ్రతతో కొనసాగుతోంది.

**కేసుల్లో కీలక మలుపు:**గత కొంతకాలంగా వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్న ఈ కేసుల విచారణను ఇప్పుడు కోర్టు రోజూవారీగా చేపట్టడం న్యాయ వర్గాల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ తాజా పరిణామం వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుల దర్యాప్తు మరియు విచారణలో అత్యంత కీలకమైన మలుపుగా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ విచారణ ఎటువంటి సంచలన మలుపులు తిరుగుతుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## పల్నాడు జిల్లా మాచర్లలో జడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం: స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ వి. సంజన సింహ

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

మాచర్ల:

పల్నాడు జిల్లాలోని మాచర్లలో జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల సన్నాహాలు, ఏర్పాట్లను పరిశీలించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ వి. సంజన సింహ బుధవారం మాచర్లలో ఆకస్మికంగా పర్యటించి తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఉండేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె ఆదేశించారు.

**స్ట్రాంగ్ రూములు మరియు కౌంటింగ్ కేంద్రాల పరిశీలన:**

ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కౌంటర్లు అలాగే ఓట్ల



లెక్కింపు (కౌంటింగ్) కేంద్రాలను జాయింట్ కలెక్టర్ వి. సంజన సింహ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా పరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, కేంద్రాల వద్ద ఎలాంటి భద్రతా లోపాలు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక నిఘా:**

ఎన్నికల కేంద్రాల వద్ద భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఆమె పరిశీలించారు.

అగ్నిప్రమాదాలను నివారించేందుకు సిద్ధం చేసిన అగ్నిమాపక పరికరాల ఏర్పాట్లను తనిఖీ చేశారు. సిబ్బందికి మరియు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక మౌలిక వసతులు కల్పించిన తీరును సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికలు ముగిసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ గట్టిగా ఆదేశించారు

## కల్పవృక్ష వాహనంపై శ్రీ మలయప్పస్వామి దివ్యదర్శనం



ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

తిరుమల:కలియుగవైకుంఠమైనతిరుమలలోశ్రీవేంకటేశ్వస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా మరియు కనులపండువగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజైన గురువారం ఉదయం శ్రీ మలయప్పస్వామి వారు ఉభయదేవేరులతో కలిసి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు.

**బకాసుర వధ అలంకారంలో వాహన సేవ:**

ఈ పవిత్ర సందర్భంలో స్వామివారు బకాసుర వధ అలంకారంలో సుందరంగా ముస్తాబై కల్పవృక్ష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. మంగళవాయిద్యాల మ్రోతలతో, భజనల ఘన కోలాహలం మరియు కోలాటాల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ వాహన సేవ అంబరాన్ని తాకేలా సాగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కల్పవృక్ష వాహనసీనుడైన శ్రీమలయప్పస్వామి వారిని దర్శించుకుని తరించారు.

**నేడు సర్వభూపాల వాహన సేవ:**

బ్రహ్మోత్సవాల పరంపరలో భాగంగా గురువారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు సర్వభూపాల వాహనంపైవిహరిస్తూభక్తులకుదర్శనమివ్వ నున్నారు. ఈ వేడుకల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించింది

## పీఎఫ్ నిధుల పాక్షిక ఉపసంహరణకు ఈపీఎఫ్ఓ నూతన నిబంధనలు: ఉద్యోగులకు భారీ ఊరట

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

దేశంలోనిఉద్యోగవర్గాలకుఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఒక కీలకమైన మరియు సానుకూలమైన నిర్ణయాన్ని వెల్లడించింది. ఉద్యోగులు తాము సర్వీస్‌లో లేదా ఉద్యోగంలో కొనసాగుతున్న సమయంలోనే తమ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో ఉన్న నిధులను పాక్షికంగా ఉపసంహరించుకోవడానికి వీలుగా సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. దీనివల్ల అత్యవసర సమయాల్లో ఉద్యోగులకు ఎంతో ఆర్థిక భద్రత లభించనుంది. ఉద్యోగుల దైనందిన జీవితంలో ఎదురయ్యే వివిధ రకాల ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ సడలింపులను అమలులోకి తెచ్చారు. ముఖ్యంగా కుటుంబంలో తలెత్తే అనూహ్యమైన వైద్య ఖర్చులు, అత్యవసర వైద్య



చికిత్సల కోసం, ఇళ్లలో జరిగే వివాహ వేడుకలకు, అలాగే పిల్లల ఉన్నత విద్య మరియు విద్యా అవసరాల నిమిత్తం పీఎఫ్ ఖాతా నుంచి నిధులను సులువుగా తీసుకునేందుకు అర్హత కల్పించారు. ఈ నూతన విధానం ద్వారా లబ్ధి పొందడానికి ఉద్యోగులు కనీసం పన్నెండు నెలల సర్వీస్ పీరియడ్ పూర్తి చేసి ఉండాలి. ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో ఉద్యోగం కోల్పోయిన కార్మికులు లేదా ఉద్యోగులు కూడా ఈ నిబంధనల ప్రకారం తమ పీఎఫ్ నిధులను పాక్షికంగా లేదా పూర్తిగా ఉపసంహరించుకోవడానికి పూర్తి అర్హత కలిగి ఉంటారు. ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా పీఎఫ్ ఉపసంహరణ కోసం క్లెయిమ్ చేసుకున్న తదనంతరం, కేవలం మూడు రోజుల వ్యవధిలోనే దరఖాస్తుదారుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలలో నేరుగా డబ్బులు జమ కానున్నాయి.

ఈ తాజా నిబంధనల రూపకల్పన ద్వారా పీఎఫ్ క్లెయిమ్ ప్రక్రియ మరింత వేగవంతం కావడంతో పాటు, ఉద్యోగులకు ఆర్థిక ఇబ్బందుల నుంచి తక్షణ ఉపశమనం లభిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## విజయవాడ ఇంద్రకీలాద్రిపై వైభవంగా నవరాత్రి ఉత్సవాలు: అమ్మవారికి రూ.75 లక్షల విలువైన అద్భుతమైన స్వర్ణ కిరీటం కానుక సమర్పణ

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

విజయవాడ:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ అపరూపమైన భక్తిసమర్పణ జరిగిందని చెప్పవచ్చు. భక్తుల కొంగు బంగారమైన కనకదుర్గమ్మకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రముఖ దాత కె.దుర్గా శ్రీనివాస్ కుటుంబ సభ్యులు సుమారు రూ. 75 లక్షల విలువైన అత్యంత సుందరమైన స్వర్ణ కిరీటాన్ని కానుకగా సమర్పించారు.

**నవరత్నాలతో అద్భుతమైన రూపకల్పన:**

అమ్మవారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ దివ్యమైన స్వర్ణ కిరీటం తయారీలో ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శించారు. దాదాపు 494 గ్రాముల



స్వచ్ఛమైన బంగారంతో పాటు, ఎరుపు, నీలం, తెలుపుమరియుపచ్చవంటి విలువైన నవరత్నాలను పొందుపరిచిఈ కిరీటాన్ని అత్యంత మనోహరంగా రూపుదిద్దారు. ఈ అరుదైన నవరత్న కిరీటాన్ని గురువారం ఘనంగా ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారుల ఘన **సత్కారం:**అమ్మవారికి ఇంతటి విలువైన కిరీటాన్ని కానుకగా సమర్పించిన దాత కె.దుర్గా శ్రీనివాస్ కుటుంబాన్ని ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో భాగంగా దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ వేదాశీర్వచనాలు అందించగా, ఆలయ అధికారులు వారికి అమ్మవారి శేషవస్త్రం మరియు ప్రసాదాలను అందజేసి అత్యంత ఘనంగా సత్కరించారు. ఈ అపూర్వ దృశ్యాన్ని తిలకించడానికి మరియు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో మార్మోగింది.

## పేదింటి ఆడబిడ్డల పెళ్లికి భరోసా కల్యాణలక్ష్మి: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:

పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు ఆర్థిక భారంగా మారకూడదనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తోందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు.

దేవరకొండ, డిండి, నేరేడుగొమ్ము, చందంపేట, కొండమల్లేపల్లి మండలాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ.71,92,000 (రూ. 71.92 లక్షలు) విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు.

**ఆడబిడ్డల కుటుంబాలకు ఆర్థిక భరోసా**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు. ఆడబిడ్డల వివాహాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక



సహాయం కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి పథకం పేదలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని, అర్హులైన ప్రతి ఒక్కరూఈఅవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం**

రైతులు, మహిళలు, పేద కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వరుసగా అమలు చేయడంతో పాటు, సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

**హాజరైన ప్రజాప్రతినిధులు నాయకులు**

ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిక్కు నాయక్, నెర్మటి సతీష్ రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, దొండేటి మల్లారెడ్డి, మావిళ్ల లక్ష్మినారాయణ, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జర్పుల బధ్యా నాయక్, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్, రామావత్ లాలునాయక్, కొప్పుల సురేందర్ రెడ్డిలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు.

డి.ఎం.ఎస్.టి, డి.ఇ.సి.జి కోర్సులలో ప్రతి దాంట్లో ఉన్న 30 సీట్లకు గాను. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను www.tgpmb.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా 24.10.2026 సాయంత్రం 05:00 గంటల లోపు నమోదు చేసుకోవాలని అన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటౌట్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ స్వయం ధృవీకరణ (Self`attestation) చేసిన జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మరియు 100 రూపాయల నగదు రుసుమును జతపరిచి 24.10.2026 సాయంత్రం 05:00 గంటల లోపు మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని అన్నారు.

దరఖాస్తులో తప్పుడు సమాచారం నమోదు చేసినా లేదా సంబంధిత ధ్రువపత్రాలు జతపరచకపోయినా దరఖాస్తులు తిరస్కరించబడతాయన్నారు

దరఖాస్తు ఫారం, పూర్తి నిబంధనలు మరియు ఇతర సూచనల కోసం అధికారిక వెబ్‌సైట్ www.tgpmb.telangana.gov.in సందర్శించగలరని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# మాసన్న కు మెరుగైన వైద్యం కోసం ఎల్. ఓ. సి అందజేసిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాజీ మంత్రి



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

వనపర్తి పట్టణం 6 వ వార్డుకు చెందిన రంగం మాసన్న అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటూ మెరుగైన వైద్యం కోసం ఎల్. ఓ. సి కావాలని మాజీ మంత్రివర్యులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కి విన్నవించుకోగా మాసన్న కు రెండు రోజుల్లోనే చిన్నారెడ్డి రెండు లక్షల 50 వేల ఎల్.ఓ.సీ ని అందజేశారు.

చిన్నారెడ్డి మాట్లాడుతూ

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్యం అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు.

ఆరోగ్య సమస్యల కారణంగా పేద కుటుంబం కూడా ఇబ్బందులు పడకూడదన్నదే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

మాసన్న మెరుగైన వైద్య సేవలు ద్వారా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు

సమయానికి ఎల్.ఓ.సి కాఫీ అందడంతో తీవ్రమైన ఆర్థిక ,అరోగ్య ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తూ చిన్నారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# నాగర్ కర్నూల్ లో రమణ70/mm నూతన థియేటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం రమణ 70/mm A/c నూతన దియేటర్ ను స్థానిక ఎమ్మెల్యే డా.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందం కోసం సినిమాలు సినిమా హాలు ఎంతో ఆనందపరుస్తాయని అన్నారు.ఈ ప్రారంభోత్సవంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు గారు,మున్సిపల్ ఛైర్మన్ తీగల సునేంద్ర గారు,వైస్ చైర్మన్ బాదం రమేష్ గారు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

# బురాన్ పురం దుర్గామాతను దర్శించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

డోర్నకల్ నియోజకవర్గ, మరిపెడ మండలం బురాన్ పురం గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా కొలువుదీరిన దుర్గామాతను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు సమర్పించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలపై దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.

భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమ్మవారిని దర్శించుకుని సత్యవతి రాథోడ్ ప్రత్యేక పూజలు చేయడం పట్ల స్థానిక భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీపురం గ్రామంలో ఉచిత పశు గర్భకోశ చికిత్స మరియు పశు ఆరోగ్య శిబిరం

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

నాగర్ కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశువైద్య అధికారి డా. పి. అశోక్ నేతృత్వంలో ఉచిత పశు గర్భకోశ చికిత్స మరియు పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో పశువులు తరలిరాగా, పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు మరియు గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచుకుల్ల గీత తాడూరు మండల డాక్టర్ ప్రవీణ్ , గోపాలమిత్ర సూపర్వైజర్ గోపాల్, గోపాలమిత్ర రాజేందర్ రెడ్డి, పశువైద్య సిబ్బంది మాధ్య



నాయక్, వినయ్, సనా సుల్తానా, మక్బూల్ మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

-సింగిల్ విండో ద్వారా అనుమతులు..
-భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం
-పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటాను
-రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి
-సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా
-సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

"తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు, భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఆయన మాట్లాడుతూ, సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతోపాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం హైదరాబాద్‌ను పెట్టుబడులకు అత్యంత అనువైన గమ్యస్థానంగా నిలుపుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనేక అనుకూలతలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు. హైదరాబాద్ వాతావరణం, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే సంప్రదాయం కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ప్రాచీన కాలం నుంచి హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపారులను, పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని,



మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు.

**మూడు ప్రాంతాలుగా అభివృద్ధి ప్రణాళిక**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్ అర్బన్ రీజియన్ (కోర్), పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ (రేర్) విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతంలో ఐటీ, మౌలిక సదుపాయాలు, సేవారంగానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. పెరి అర్బన్ ప్రాంతంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భవిష్యత్తులో నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని అనుసంధానిస్తూ రేడియల్ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే 21 రేడియల్ రోడ్లకు సంబంధించి మంజూరు, రూపకల్పన ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ రహదారుల అనుసంధానంతో ఫార్మా, బయోటెక్నాలజీ, విద్య, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేసే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. రూరల్ అగ్రికల్చర్ రీజియన్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు అవసరమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వనరులకు విలువ జోడించే పరిశ్రమలు ఏర్పాటు కావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర

మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించేవారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.

**పరిశ్రమలకు ప్రభుత్వం అండగా ఉంటుంది**

సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

పెట్టుబడులకు అవసరమైన అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు, వ్యాపారం, సినీ పరిశ్రమ, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని చెప్పారు.

**అందరినీ కలుపుకొని అభివృద్ధి సాధించాలి**

సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒక వర్గం మాత్రమే అభివృద్ధి చెందడం సంపూర్ణ ప్రగతి కాదని, తమతోపాటు మరో పదిమందిని ముందుకు తీసుకెళ్లినప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి విక్రమార్క, వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని కోరారు.

# ఎస్ఐఆర్ స్పెషల్ రివిజన్ కార్యక్రమం





**- రీ సర్వే కార్యక్రమాన్ని, మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లలో ఆకస్మికంగా తనిఖీలు.**
**- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, మండలంలోని బొద్దుగొండ, మదనాపురం గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు.

గురువారం, శుక్రవారం జరిగే స్పెషల్ ఇండెన్సివ్ రివిజన్, సర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ మార్పులు, చేర్పులను స్వయంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు.

మదనాపురం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం సర్వేను కొనసాగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు సమాచారం అందించాలని, రైతును కూడా తమ భూముల యొక్క హద్దులను ముందుగా స్థిరపరచుకోవాలని తద్వారా సర్వే సులభంగా పారదర్శకంగా కొనసాగుతుందని కలెక్టర్ సూచించారు.

ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానం వైపు మొగ్గుచుపాలని నీటి వాడకం తక్కువగా ఉండే పంటలను వేయాలని రైతులకు సూచించారు.

విబిజి రాంజీ ఉపాధి హామీ పథకం కింద రైతులకు వివిధ పనులను అప్పగించాలని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు.

మండలంలో సాగునీరు, త్రాగునీరు సరఫరా లో ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అర్హత కలిగిన రైతులందరికీ పంట రుణాలను అందించాలని కలెక్టర్ తెలిపారు.

'సర్' తుది జాబితాలో చోటుకు మరో అవకాశం అక్టోబర్, 15,16 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు

ఈ ఏడాది నవంబరు 9న ప్రకటించనున్న 'సర్' ఓటరు తుది జాబితాలో తమ పేరు చేర్చుకోవడానికి పౌరులకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చిందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ నేడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

ఇందులో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15, 16వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తోందని ఇందులో కొత్త ఓటరుగానూ నమోదు చేసుకోవచ్చని ముసాయిదా జాబితా ప్రచురణలో భాగంగా ఏఎస్డీడీ(ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ అండ్ డూప్లికేట్) పేరుతో తొలగించిన 73 లక్షల ఓటర్లకు సైతం మరో అవకాశం కల్పించిందని అన్నారు.

ఎక్కడైనా పొరపాటున ఈ జాబితాలో చేరిన ఓటర్లు కూడా ఈ శిబిరాలలో ఫారం-6ను సమర్పించవచ్చునని అన్నారు.

ఈ రెండు రోజుల్లో ఫారం-6 సమర్పించిన వారి పేర్లను నవంబరు 9న ప్రచురించే తుది జాబితాలో చేర్చడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. వాస్తవానికి 'సర్'లో భాగంగా ఫిర్యాదులు, అభ్యంతరాల సమయంలో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి గత ఆగస్టు 17 నుంచి ఈ నెల 7వ తేదీ వరకే వెసులుబాటు కల్పించారు. ఈ గడువు ముగియడంతో 'సర్' తుది జాబితాలో అవకాశం లేకుండా పోయిందని, అయితే ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో 15, 16వ తేదీల్లో ఫారం-6 ఇవ్వడానికి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చినందున ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

అనంతరం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లల వార్డు, స్త్రీ, పురుషుల వార్డులను స్వయంగా తనిఖీ చేసి మందుల స్టోర్ గదిని, ఓపి రిజిస్టర్, హాజరు పట్టిక, సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు.

వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని, నిత్యం సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు మీ ప్రమాణం యాప్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

వార్డులలో చికిత్స పొందుతున్న పిల్లలు, పేషెంట్లను ఆప్యాయశీగా పలకరిస్తూ వారికి అందుతున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోని అన్ని సబ్ సెంటర్ల వారిగా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని,ప్రభుత్వం ప్రవేశపెట్టే వైద్య కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం ప్రజలకు అందించాలని కలెక్టర్ తెలిపారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలన్నారు.

హాస్పటల్లోని ఎక్సరే, ల్యాబ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ చీర శ్రీనివాసులు, స్థానిక తహసిల్దార్ నాగ భవాని , రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరేష్ రెడ్డి, సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

# పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రహదారి దుస్థితి దారుణం






**అన్నమయ్య జిల్లా ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అన్నీ ఉన్నా ఏదీ లేనట్లుగా పరిస్థితి ఉందని స్థానికులు ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వస్తుంటారు. అయితే ఆసుపత్రి ఆవరణలోని రహదారులు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆసుపత్రికి వచ్చే ప్రజలు వాపోతున్నారు. గతంలో పట్టణంలోని నువ్వుషావలిబాబా దర్గా నుంచి శుభారం డిగ్రీ కళాశాల వరకు రహదారి దుస్థితిపై పలుమార్లు వార్తలు రావడంతో అధికారులు నామమాత్రంగా మరమ్మతులు చేపట్టారు. కానీ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని సుమారు 300 మీటర్ల రహదారి మాత్రం అధ్వానంగా మారింది. అనునిత్యం అంబులెన్సులు, ఇతర వాహనాలు గుంతల మధ్య ప్రయాణించాల్సి వస్తుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రికి తీసుకువచ్చే సమయంలోనూ ఈ రహదారి కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ ఆసుపత్రికి వచ్చే ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా ఆసుపత్రి పర్యవేక్షకులు, సంబంధిత శాఖల అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి, రహదారికి మరమ్మతులు చేపట్టి నూతన రహదారి నిర్మించాలని ఆసుపత్రికి వచ్చే ప్రజలు కోరుతున్నారు

# ఉండిలో శ్రీ మహా చండీ దేవి అవతారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
ఉండి స్థానిక కొత్తపేటలో శ్రీ కనకదుర్గమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీశ్రీశ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు
గురువారం అమ్మవారిని శ్రీ మహా చండీ దేవి అమ్మవారిగా ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులచే ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. 9 రోజులు 9 అవతారాలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తుండటంతో భక్తుల తాకిడి పెరిగింది.
ఈ ప్రత్యేక పూజలో డాక్టర్ బాల శ్రీను, స్థానికులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తుల



నుండి విశేష ఆదరణ లభిస్తోందని, ఇదే విధంగా ప్రతి ఏటా అమ్మవారి ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డొకార శ్రీనివాసు, శ్రీలక్ష్మి, పోలుబోతు రామస్వామి (రాము), రాజేశ్వరి, దాకి మూర్తి దంపతులు మరియు స్థానిక యూత్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకివీడు అబ్దుల్ కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకలు ఆకివీడులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆకివీడు అబ్దుల్ కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో ఉచిత మేగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.
స్థానిక యువ నాయకులు ట్రస్ట్ వ్యవస్థాపకులు నడిపూడి రమణ, మజ్జి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల వైద్య బృందం పాల్గొని ప్రజలకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి పరీక్షలు చేశారు. ఆకివీడు హోప్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం నిర్వాహకులు నడిపూడి రమణ, మజ్జి శ్రీను మాట్లాడుతూ భారతరత్న అబ్దుల్ కలాం ఆశయ సాధన కోసం ప్రతి ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కలాం జయంతిని పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేయడం వల్ల అనేక మంది పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైద్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి..





**మహబూబాబాద్ జిలా ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
వరంగల్ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హన్మకొండలోని మడికొండ సత్యసాయి గార్డెన్‌లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశానికి పాలకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ హాజరును నమోదు చేశారు.
ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి , కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, టీపీసీసీ నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.
పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో సమావేశం సందడిగా సాగింది.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రక్షాళన చేస్తాంలి ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారులను బదిలీ చేస్తాం

**-2018 నుంచి క్లెయిమ్‌లపై సమగ్ర విజిలెన్స్ విచారణ**
**-అక్రమాలకు పాల్పడిన వారెవరైనా ఉపేక్షించం**
**-నా సిఫారసు లేఖతో క్లెయిమ్ మంజూరైనట్లు వచ్చిన వార్తలు అవాస్తవం**
**-శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
కార్మికుల సంక్షేమ నిధులను పరిరక్షించడంతో పాటు పరిపాలనలో పారదర్శకతే లక్ష్యంగా కార్మిక శాఖలో సమూల ప్రక్షాళన చేపట్టనున్నట్లు శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను ప్రక్షాళన చేయడంతో పాటు, ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన అధికారులను త్వరలోనే బదిలీ చేస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి రూపాయి సక్రమంగా వినియోగమయ్యేలా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామన్నారు.
సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కార్మిక శాఖలో క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ప్రాథమిక ఆధారాల మేరకు ఇద్దరు అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశామని, వ్యవహారంపై సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించామని వెల్లడించారు. విచారణలో ఎవరిపాత్ర బయటపడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్మికుల పరిహార క్లెయిమ్‌ల పరిష్కారంలో పారదర్శకత లోపించడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని మంత్రి తెలిపారు. బోగస్ పత్రాలు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అక్రమంగా క్లెయిమ్‌లు పొందినట్లు ఆరోపణలు రావడంతో 2018 నుంచి ఇప్పటివరకు నమోదైన అన్ని రకాల క్లెయిమ్‌లను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించినట్లు చెప్పారు. జాయింట్ లేబర్ కమిషనర్ స్థాయిలో ప్రాథమిక విచారణ జరిపి ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నామని వివరించారు. దాని ఆధారంగా విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. విజిలెన్స్ నివేదిక నెల, రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని, నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తప్పు చేసిన అధికారులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. క్లెయిమ్‌ల పరిశీలన, పరిహారం మంజూరు, చెల్లింపుల బాధ్యత సంబంధిత కార్మిక శాఖ అధికారులదేనని మంత్రి తెలిపారు. బోర్డులోని విధానాలను సమీక్షించి, అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రక్రియలను మరింత పటిష్ఠం చేస్తామన్నారు. వివిధ సంస్థలు, నిర్మాణదారుల నుంచి వసూలు కావాల్సిన వందల కోట్ల రూపాయల లేబర్ సెస్సును నిబంధనల ప్రకారం పెనాల్టీలతో సహా వసూలు చేస్తామని వెల్లడించారు. తన సిఫారసు లేఖ ఆధారంగా కార్మికుల పరిహార క్లెయిమ్ మంజూరైనట్లు ఒక పత్రికలో వచ్చిన కథనాలు అవాస్తవమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులను ఆశ్రయించడం సహజమని, సంబంధిత అధికారులకు నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించడం సాధారణ విధానమని చెప్పారు. తన వద్దకు వచ్చిన దరఖాస్తుపై నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని మాత్రమే సూచించానని వివరించారు. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో ఆ దరఖాస్తును తిరస్కరించారని, దరఖాస్తుదారుడికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం చెల్లించలేదని తెలిపారు. చెల్లింపే జరగనప్పుడు తన సిఫారసుతో క్లెయిమ్ మంజూరైనట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. సింగరేణి సంస్థ పరిస్థితిపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య లక్ష నుంచి 38 వేలకు పడిపోయిందని, దాదాపు 62 వేల ఉద్యోగాలు తగ్గిపోయాయని అన్నారు. ఆ పదేళ్లలో ఒక్క కొత్త బొగ్గు గని కూడా సంస్థకు రాలేదని పేర్కొన్నారు. బొగ్గు గనుల వేలం చట్టానికి పార్లమెంట్‌లో అనుకూలంగా ఓటేసింది బీఆర్ఎస్ ఎంపీలేనని మంత్రి గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు గనులు కేటాయించే అవకాశాలపై కేంద్ర ప్రభుత్వం లేఖ రాసినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వేలంలో పాల్గొని ఆర్కేఓసీ మైన్, తాడిచర్లలో మరో గనిని సింగరేణికి దక్కేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కొత్త గనుల ఏర్పాటు ద్వారా బొగ్గు ఉత్పత్తి పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. సంస్థ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని పెట్టుబడులు పెట్టడం అత్యవసరమని, సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ విస్తరణకు అవసరమైన నిధులను క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ కింద కేటాయించడం సంస్థ దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమేనని వివరించారు.
సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరుకు దక్కాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులను గత బీఆర్ఎస్ పాలనలో సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ ప్రాంతాలకు మళ్లించారని మంత్రి అన్నారు. బొగ్గు గనుల ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి, స్థానిక ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించడం సమంజసం కాదన్నారు.
సింగరేణి సంస్థపై గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మోపిందని, కాంట్రాక్టర్ల బిల్లులు, ఉద్యోగుల బకాయిలు పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. సంస్థ ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేస్తూ, భవిష్యత్తులో పోటీని తట్టుకునేలా పెట్టుబడులు పెట్టడం ప్రస్తుత ప్రభుత్వ విధానమని తెలిపారు.
బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెట్టిందని మంత్రి అన్నారు. రాష్ట్రంపై సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని, గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలు, అప్పులపై వడ్డీల చెల్లింపులు ప్రస్తుత ప్రభుత్వానికి భారంగా మారాయని అన్నారు.
ప్రజాధనాన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల వ్యయం, నిధుల వినియోగంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నేతలపై ఉందన్నారు.

# పేదింటి ఆడబిడ్డల పెళ్లికి భరోసా కల్యాణలక్ష్మి: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**- ఐదు మండలాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ.71.92 లక్షల చెక్కుల పంపిణీ**
**- అర్హులైన నిరుపేద కుటుంబాలకు అండగా ప్రజా ప్రభుత్వం**





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు ఆర్థిక భారంగా మారకూడదనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తోందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు.
దేవరకొండ, డిండి, నేరేడుగొమ్ము, చందంపేట, కొండమల్లేపల్లి మండలాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ.71,92,000 (రూ. 71.92 లక్షలు) విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు.

**ఆడబిడ్డల కుటుంబాలకు ఆర్థిక భరోసా**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు. ఆడబిడ్డల వివాహాల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.
కల్యాణలక్ష్మి పథకం పేదలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం**
రైతులు, మహిళలు, పేద కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వరుసగా అమలు చేయడంతో పాటు, సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

**హాజరైన ప్రజాప్రతినిధులు నాయకులు**
ఈ కార్యక్రమంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిక్కు నాయక్, నెర్మటి సతీష్ రెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, దొండేటి మల్లారెడ్డి, మావిల్ల లక్ష్మినారాయణ, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జర్పుల బధ్యా నాయక్, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్, రామావత్ లాలునాయక్, కొప్పుల సురేందర్ రెడ్డిలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కీసర తహసీల్దార్ కార్యాలయంలో ఏసిబి దాడులు...





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
కీసర తహసిల్దార్ కార్యాలయంలో సక్సెషన్ కోసం రూ.5 లక్షలు డిమాండ్ చేశారనే ఆరోపణలకు రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులురెడ్‌హ్యాండెడ్‌గాపట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఇటీవల కీసరకు చెందిన పన్నాల బుచ్చి రెడ్డి భార్య పన్నాల సుశీల మృతి చెందడంతో పన్నాల గిరిధర్ రెడ్డి అనే వ్యక్తి తన తల్లి పేరు మీద ఉన్న సర్వే నెంబర్ 183,184 లో ఉన్న 3-00 ఎకరాల భూమిని సక్సెషన్ కోసం సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించాడు. ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అయితే ఇట్టి భూమి 22లా లో ఉంది అని ఈ సక్సెషన్ పూర్తి చేసేందుకు సందీప్ రెడ్డి సుమారు రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. 22లా లో నుండి తీయాలి అంటే తహసిల్దార్ కి ఆర్డీఓ ఆఫీసులో సైతం డబ్బులు ఇవ్వాలి అని బాధితుడికి చెప్పడం జరిగింది. ఈ నేపథ్యంలో పన్నాల గిరిధర్ రెడ్డి రూ 2.50 లక్షలను మొదటగా ఎంఆర్ఓ కార్యాలయంలో విజయ్ కుమార్ రెడ్డికి అందజేసినట్లు సమాచారం. అనంతరం విజయ్ కుమార్ ఆ నగదును కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ గా పేర్కొంటున్న బాలకృష్ణకు ఇచ్చినట్లు తెలిసింది. బాలకృష్ణ ఆ నగదును డిప్యూటీ తహసిల్దార్ సందీప్ రెడ్డి గదిలోకి తీసుకెళ్లి అతని బ్యాగ్ లో పెడుతున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.

ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శుక్రవారం , అక్టోబర్,16, 2026
www.trinetnews.com

# కరువు ముప్పు, భవిష్యత్ కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో సమీక్ష



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
రాష్ట్రంలో నెలకొన్న ఎల్నినోపరిస్థితులు, కరువు ముప్పు, భవిష్యత్ కార్యాచరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఎల్నినో, వర్షాభావ పరిస్థితులపై అధికారులు ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక సమర్పించారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 320 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు తమ నివేదికలో స్పష్టం చేశారు. అందులోనూ 117 మండలాల్లో తీవ్రమైన కరువు తాండవిస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం సలహాదారు రామకృష్ణారావు ఎల్నినో తీవ్రత, దాని వల్ల కలిగే ప్రభావాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఎల్నినో ప్రభావాన్ని తగ్గించేందుకు గాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సబ్ కమిటీ కరువు పరిస్థితులను అధిగమించేందుకు, తాగునీరు, సాగునీరు, పంట నష్టాల నివారణకు సమగ్రమైన 'రోడ్ మ్యాప్' సిద్ధం చేయనుంది. కేబినెట్ సబ్ కమిటీ తన తొలి సమావేశాన్ని రేపు (శుక్రవారం) నిర్వహించనుంది. మరోవైపు ఇప్పటికే ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో 11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వ యంత్రాంగం తేల్చింది. ఈ నష్టానికి సంబంధించి ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం అందించాలని అధికారులు ప్రభుత్వానికి సూచించారు. ఇందుకోసం రూ.1,118 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. రానున్న రోజుల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రం కానుందని వాతావరణ శాఖ అంచనాలు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కరువు పరిస్థితులు, పంటనష్టం, తాగునీరు, సాగునీటి లభ్యతపై ప్రభుత్వ యంత్రాంగం సమగ్ర నివేదిక రూపొందించింది. ఈ నివేదికను ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి అధికారులు సమర్పించారు.

# రైతులకు చేరువ కావాలి వ్యవసాయ ఆవిష్కరణలు ఎస్టిక్--2026లో ఐసీఏఆర్ పరిశోధనలకు ప్రత్యేక స్థానం

## అక్టోబర్ 27--29 తేదీల్లో ఢిల్లీలో సదస్సు: డాక్టర్ ఎం.ఎల్. జాట

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 (ట్రైనెట్ న్యూస్):**
వ్యవసాయ పరిశోధనల ఫలితాలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా రైతుల పొలాలకు చేరాలని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్, వ్యవసాయ పరిశోధన--విద్యా విభాగం కార్యదర్శి డాక్టర్ ఎం.ఎల్. జాట్ స్పష్టం చేశారు. సమర్థమైన విత్తన సరఫరా వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ, క్షేత్రస్థాయి వినియోగం ద్వారా ఆవిష్కరణల ప్రయోజనాలను రైతులకు అందించాలని పేర్కొన్నారు.

హరియాణాలోని కర్నాల్‌లో ఐసీఏఆర్--కేంద్ర నేల లవణీయత పరిశోధనా సంస్థ (సీఎస్ఎస్ఆర్ఐ)లో గురువారం నిర్వహించిన ఎస్టిక్--2026 సన్నాహక సమావేశం, మీడియా ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 27 నుంచి 29 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న 'ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్క్లేవ్'లో వ్యవసాయ సాంకేతికత, ఆహార వ్యవస్థలు, పోషకాహారం అంశాల్లో ఐసీఏఆర్ పాత్రను వివరించారు.

**12 ప్రధాన రంగాల్లో సాంకేతిక ప్రదర్శనలు**

ఎస్టిక్--2026లో శాస్త్ర సంబంధిత మంత్రిత్వ శాఖలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, ఇతర భాగస్వాములు పాల్గొంటారని తెలిపారు. మొత్తం 12 ప్రధాన అంశాలపై శాస్త్ర, సాంకేతిక పురోగతిని ప్రదర్శించనున్నారు. ప్రదర్శనలో 13 విభాగాల స్టాళ్లు, 50 డీప్‌టెక్ స్టార్టప్‌లు, 10 విభాగీయ సాంకేతికతలు చోటుచేసుకోనున్నాయి. ప్రధాన ప్రసంగాలు, సాంకేతిక--సమాంతర సమావేశాలు, అంతర్జాతీయ సహకార వేదికలు నిర్వహించనున్నారు.

**జన్యు సవరణ నుంచి వ్యవసాయ యాంత్రీకరణ వరకు**




జన్యు సవరణ, పోషక విలువలు పెంచిన పంట రకాలు, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం, సమగ్ర సస్యరక్షణ, ఉద్యాన పంటల వైవిధ్యీకరణపై ఐసీఏఆర్ దృష్టి సారించినట్లు జాట్ తెలిపారు. పశు ఆరోగ్యం, మత్స్యరంగం, సహజ వనరుల నిర్వహణ, వ్యవసాయ యాంత్రీకరణలోనూ పరిశోధనలు కొనసాగుతున్నాయని చెప్పారు. వివిధ మంత్రిత్వ శాఖల సమన్వయంతో సమగ్రంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని వివరించారు.

ప్రపంచంలోనే తొలి రెండు జన్యు సవరణ వరి రకాలు, దేశంలో తొలి సంపూర్ణ కందిపంట రిఫరెన్స్ జన్యుపటం వంటి పరిశోధన విజయాలను ప్రదర్శించనున్నారు. గత ఏడాది ఐసీఏఆర్ 117 ఉద్యాన పంట రకాలను అభివృద్ధి చేసినట్లు ఆయన వెల్లడించారు. పోషక విలువలు పెంచిన పంటలు, సమీకృత వ్యవసాయ విధానాలతో పోషక భద్రతకు తోడ్పడుతున్నట్లు తెలిపారు.

**నేల ఆరోగ్యానికి కృత్రిమ మేధ వినియోగం**

'సాయిల్ ఇంటెలిజెన్స్: ఏఐ అండ్ పెడలాజికల్ సైన్స్' పేరుతో నేలల అధ్యయనంలో కృత్రిమ మేధ వినియోగాన్ని ప్రదర్శించనున్నారు. నేల లక్షణాల అంచనా, వనరుల సమర్థ వినియోగం, పంటల ప్రణాళికకు ఈ సాంకేతికతలు ఉపయోగపడతాయని వివరించారు. నేల ఆరోగ్యం, నీటి నిర్వహణ, సుస్థిర సాగు పద్ధతులపై పరిశోధనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

సౌరశక్తితో ఉత్పత్తి చేసే హైడ్రోజన్‌ను ఉపయోగించి గ్రీన్ అమ్మోనియా తయారీపై పరిశోధనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఐసీఏఆర్, కేంద్ర నూతన--పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ, ఇతర భాగస్వాముల సహకారంతో ఆరు రాష్ట్రాల్లో 10 వేల ఎకరాల పరిధిలో చేపట్టిన ప్రదర్శనలను సమావేశంలో ప్రస్తావించారు.

**వ్యవసాయం--ఆరోగ్యానికి 'సెహత్' అనుసంధానం**

వ్యవసాయం, ఆహారం, మానవ ఆరోగ్యాన్ని అనుసంధానించేందుకు ఐసీఏఆర్, భారత వైద్య పరిశోధనా మండలి సంయుక్తంగా రూపొందించిన 'సెహత్' కార్యక్రమాన్ని వివరించారు. పోషక విలువలు పెంచిన పంటలు, సమీకృత వ్యవసాయ విధానాలు ఇందులో కీలకంగా ఉంటాయని తెలిపారు. పాలలో కల్తీని వేగంగా గుర్తించేందుకు జాతీయ పాడి పరిశోధనా సంస్థ అభివృద్ధి చేసిన క్షేత్రస్థాయి పరీక్ష కిట్‌ను కూడా ప్రదర్శించనున్నారు.

పశువుల వ్యాధుల నివారణకు స్వదేశీ టీకాల పరిశోధన, దేశీయ పశుజాతుల పరిరక్షణ, లవణీయ ప్రాంతాల్లో రొయ్యల సాగు, పత్తి కోత యంత్రాలు వంటి ఆవిష్కరణలు సైతం ప్రదర్శనలో భాగం కానున్నాయి. అంతకుముందు సీఎస్ఎస్ఆర్ఐ డైరెక్టర్ మాట్లాడుతూ ఉప్పు ప్రభావిత నేలల గుర్తింపు, పునరుద్ధరణ, నాసిరకం నీటి నిర్వహణ, లవణీయతను తట్టుకునే పంట రకాల అభివృద్ధిలో సంస్థ కృషిని వివరించారు. ఆహార--పోషక భద్రత, రైతు సుసంపన్నత, సుస్థిర వ్యవసాయాభివృద్ధిలో శాస్త్ర సాంకేతికత పాత్రను ప్రజలకు తెలియజేయడమే ఈ

# కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో పరిశ్రమల తనిఖీ

## వరంగల్‌లో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం: సబ్యసాచి ఘోష్



**వరంగల్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
వరంగల్ జిల్లాలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమల పురోగతికి అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ఐఏఎస్ అధికారులకు సూచించారు.గురువారం ఆయన వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కిటెక్స్ యంగ్‌వన్, గణేశా కంపెనీలను స్వయంగా తనిఖీ చేశారు. ఆయా పరిశ్రమల్లోని ఉత్పత్తి కార్యకలాపాలు, పనితీరును పరిశీలించి, సంబంధిత అంశాలపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో ముచ్చటించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వరంగల్ ప్రాంతంలో వస్త్ర పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం కల్పించాలని, స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను పెంపొందించాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన ప్రతిపాదనలతో ముందుకు రావాలని అధికారులను ఆదేశించారు. వస్త్ర పరిశ్రమ రంగం అభివృద్ధి చెందడం ద్వారా స్థానికంగా పరిశ్రమల విస్తరణకు, ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి, పరిశ్రమలకు అవసరమైన సహకారాన్ని సకాలంలో అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, చేనేత మరియు వస్త్ర శాఖ అదనపు సంచాలకులు ఎన్. వెంకటేశ్వరరావు, ఏడీ శ్రీకాంత్ రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, నారాయణ రెడ్డి, టీటీడీఓ, సంగెం తహసీల్దార్ జి. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నా

# ఎన్‌సీసీ కేడెట్ల సంఖ్యను 20 లక్షలకు పెంచాలి యువతలో 'దేశమే ప్రథమం' స్ఫూర్తిని పెంపొందించాలి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేఠ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 (ట్రైనెట్ న్యూస్):**
జాతీయ కేడెట్ దళం (ఎన్‌సీసీ) విస్తరణకు రాష్ట్రాలు ఆచరణాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేఠ్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం సుమారు 17 లక్షలుగా ఉన్న కేడెట్ల సంఖ్యను 20 లక్షలకు పెంచాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యాన్ని సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.అస్సాంలోని గువాహటిలో గురువారం ఎన్‌సీసీ నిర్వహించిన రాష్ట్రాల ప్రతినిధులు, అదనపు డైరెక్టర్ జనరళ్ల ప్రత్యేక సంయుక్త సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈశాన్య ప్రాంతంలోని ఏడు రాష్ట్రాలతోపాటు పశ్చిమ బెంగాల్, సిక్కింలో ఎన్‌సీసీ విస్తరణ, బలోపేతం, సమర్థ నిర్వహణపై సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా సంజయ్ సేఠ్ మాట్లాడుతూ యువతలో 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తిని పెంపొందించేలా ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించాలని కోరారు. కేడెట్లకు మౌలిక వసతులు, మెరుగైన శిక్షణ సదుపాయాలు కల్పించడంపై రాష్ట్రాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్‌సీసీ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

గణతంత్ర దినోత్సవ శిబిరంలో ఈశాన్య రాష్ట్రాల కేడెట్ల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. బాలికల నమోదు పెరుగుతుండటం మహిళా సాధికారతకు ఎన్‌సీసీ అందిస్తున్న తోడ్పాటును ప్రతిబింబిస్తోందన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ,దేశసేవపట్లఅంకితభావాన్నిపెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్‌సీసీ మధ్య సమన్వయం పెంపు, కేడెట్ల సంక్షేమం, శిక్షణ వసతులు, సంస్థాగత బలోపేతం, పరిపాలనాపరమైన సమస్యల పరిష్కారంపై సదస్సులో చర్చించారు. సామాజిక సేవ, సమాజాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యతను పెంపొందించడంలో ఎన్‌సీసీ పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు.

ఈశాన్య ప్రాంత ఎన్‌సీసీ డైరెక్టరేట్ పరిధిలో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల్లో తొమ్మిది గ్రూప్ ప్రధాన కార్యాలయాలు, 50 యూనిట్లు పనిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలోని 1,645 విద్యాసంస్థల్లో సుమారు 1.25 లక్షల మంది కేడెట్లు ఉన్నారు. పశ్చిమ బెంగాల్--సిక్కిం డైరెక్టరేట్ పరిధిలో ఆరు గ్రూప్ ప్రధాన కార్యాలయాలు, 56 యూనిట్ల ద్వారా 1,326 విద్యాసంస్థల్లో సుమారు 1.25 లక్షల మంది కేడెట్లు కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు.

ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వత్స్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సదస్సులో అదనపు కార్యదర్శి దీప్తి మొహిల్ చావ్లా, తొమ్మిది రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు, రక్షణ మంత్రిత్వ శాఖ, ఎన్‌సీసీ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# పోలవరం పై అంతర్జాతీయ నిపుణుల సమీక్ష

## ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు వంటల వరకు సమావేశం- వివిధ అంశాలపై సమీక్ష



**పోలవరం, ట్రైనెట్ న్యూస్ అక్టోబర్ 15:**
పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన ఎర్త్ కం రాక్ ఫిల్ (ఈ సి ఆర్ ఎఫ్ ) డ్యామ్ నిర్మాణం పై అంతర్జాతీయ నిపుణులు గురువారం సమీక్షించారు. కేంద్ర జలవనరుల శాఖ, రాష్ట్ర జలవనరుల శాఖ, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్ ) ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశం పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజీవ్ వోహ్రా అధ్యక్షతన జరిగింది.కేంద్ర జలసంఘం డిజైన్స్ విభాగం చీఫ్ ఇంజినీర్ సరబ్జిత్ సింగ్ బక్షి, పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, ఉప సంచాలకుడు ఏ. ప్రవీణ్, చీఫ్ ఇంజినీర్ ఎం. రమేష్‌కుమార్, సహాయ సంచాలకుడు సీహెచ్ సంజీవ్, నేషనల్ వాటర్ సిస్టం డైరెక్టర్ పన్నీర్ సెల్వం, ఉప సంచాలకులు అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, సహాయ సంచాలకుడు హేమంత్ గౌతమ్ , సిఎస్ఎంఆర్ ఎస్ శాస్త్రవేత్తలు షాహిద్ నూర్, ఎం.కె. బాషా, ఉదయ్ భాను చక్రబోర్తి, వ్యాప్కోస్ జనరల్ మేనేజర్ కేపీఎస్ త్యాగి, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ కె. నరసింహమూర్తి, చీఫ్ ఇంజినీర్ కె. శేషబాబు, ఎస్‌ఈలు పి. రామచంద్రరావు, డి. తిరుమలరావు, ఈఈలు డి. శ్రీనివాస్, ప్రేమ్‌చంద్, కె. బాలకృష్ణమూర్తి, ఎంఈఐఎల్ జనరల్ మేనేజర్ ఏవీ గంగాధర్‌కుమార్, డీజీఎం మురళి పమ్మి, కోఆర్డినేటర్ ఠాగూర్ చంద్ తదితరులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం కేంద్ర జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్ట్ లో క్షేత్రస్థాయిలో పనులను కొద్దిసేపు పరిశీలించారు. సమీక్ష సందర్భంగా డిజైన్లకు సంబంధించి అఫ్రీ సంస్థ ప్రతినిధులు ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ పరికరాల్లో పనుల్లో ఏమైనా తేడా ఉంటె నమోదు అవుతుంది. ఆ పరికరాలు నమోదు చేసిన రికార్డులను అంతర్జాతీయ నిపుణులకు రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు అంద చేశారు. వాటిని పరిశీలించిన అధికారులు ఎలాంటి తేడాలు లేవని నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. జి హిల్, జి డ్యాష్ హిల్ ల వద్ద జరుగుతున్నగ్రౌటింగ్ పనులపై సమీక్షించిన నిపుణులు తమ సంతృప్తి వ్యక్తం చేశారు.

# మాదాపూర్ ఖానమేట్ లోరూ.300 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా, రెవెన్యూ అధికారులు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
మాదాపూర్ ఖానామెట్ సర్వే నంబర్ 41/14లో ఉన్న రెండు ఎకరాల భూమిని హైడ్రా, రెవెన్యూ అధికారులు రక్షించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.రూ 300 కోట్లు విలువ చేసే భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఫిర్యాదు అందడంతో రెండు శాఖల అధికారులు రంగంలోకి దిగారు. ఈ భూమి తమదంటే తమదంటూ గత కొన్ని రోజులుగా రెండు వర్గాలు పోటీపడుతున్నాయి. స్థలంలో షీట్లు ఏర్పాటు చేసి భూమిని స్వాధీనం చేసుకునేందుకు ఇరు వర్గాలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో తహసిల్దార్ మహిపాల్ రెడ్డి కబ్జాదారుల కు నోటీస్ ఇచ్చి భూమి స్వాధీనం చేసుకొనేందుకు ఆర్డర్ పాస్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కోట్లాది రూపాయల విలువైన భూమి విషయంలో వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో అధికారుల చర్యలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.1954--55 ఖస్రా పహాణీ ప్రకారం ఖానామెట్‌లో పాత సర్వే నంబర్ 55లో 286 ఎకరాల భూమి పోరంబోకు సర్కారీగా నమోదైనట్లు ప్రభుత్వం వాదిస్తోంది. తదుపరి సర్వేలో కొత్త సర్వే నంబర్ 41గా మారి, వసూల్ బాకీ రికార్డు ప్రకారం 252.24 ఎకరాలుగా నమోదైనట్లు తెలిపారు. 41/13/యూలో లో ఉన్న భూమిని కూల్చివేయడం ఏమిటని కబ్జాదారులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. వివాదాస్పద ఫెన్సింగ్ స్థలం సర్వే నంబర్ 41/14లోని ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు ఆర్డర్ పాస్ చేయడంతో. ఈ రెండు సర్వే



నంబర్ల మధ్య భౌగోళిక హద్దులు ఎక్కడున్నాయి? సంస్థ సమర్పించిన పత్రాల్లో పేర్కొన్న స్థలం, క్షేత్రస్థాయిలో ఫెన్సింగ్ వేసిన స్థలం ఒకటేనా? దీనికి సమాధానం అధికారిక సర్వే స్కెచ్, ఎఫ్ఎంబి జాయింట్ సర్వే నివేదికలతోనే తేలుతుంది.41/13/యూపై హక్కులు కోరుతున్న సంస్థ సమర్పించిన డాక్యుమెంట్లను బోగస్ గా తేల్చారు.గతంలో ఇచ్చిన నోటీసులపై అక్రమ దారులు హైకోర్టును ఆశ్రయించారు.

ఖానామెట్ భూమిపై హైకోర్టును ఆశ్రయించిన జీఏఆర్ డెవలపర్స్

ఖానామెట్ లో ఉన్న భూమికి సంబంధించి జీఏఆర్ డెవలపర్స్ సంస్థ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. సర్వే నంబర్ 41/13ఏలో ఉన్న 5,421 చదరపు గజాల భూమిపై అధికారులు జోక్యం చేసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సంస్థ రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

కలెక్టర్ ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ పిటిషన్ వేశారు. 2025లో జారీ చేసిన ప్రొసీడింగ్స్ నంబర్ దీ/630/2025ను రద్దు చేయాలని జీఏఆర్ డెవలపర్స్ కోరింది. ఆ ప్రొసీడింగ్స్ చట్టవిరుద్ధమైనవని, ఏకపక్షంగా ఉన్నాయని, అధికార పరిధిని మించి జారీ చేశారని పిటిషనర్ వాదించారు.ఈ కేసులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శేరిలింగంపల్లి మండల తహసీల్దార్, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)లను ప్రతివాదులుగా చేర్చారు.

త్రినేత్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
శుక్రవారం , అక్టోబర్,16, 2026
www.trinetnews.com

## డ్యూ డేట్‌లో పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో విలక్షణ నటుడు సునీల్

**త్రినేత్ న్యూస్, అక్టోబర్ 15:**

లోమేష్ పుడిపెద్ది హీరోగా, జయశ్రీ హీరోయిన్‌గా, ప్రణీత పట్నాయక్, విజ్ఞానిలు ముఖ్యపాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'డ్యూ డేట్' వరిష్ స్టూడియోస్ పతాకంపై పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మాతలుగా ఆనంద్.కె. దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవల ఘనంగా పూజా కార్యక్రమాలు జరుపుకున్న సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఏకధాటిగా జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో పలు కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. కాగా ఇటీవల కమెడియన్ కృష్ణభగవాన్ 'డ్యూ డేట్' షూటింగ్‌లో జాయిన్ అయిన సంగతి తెలిసిందే. చాలా కాలం విరామం తరువాత కృష్ణ భగవాన్ ఈ చిత్రంలో ఓ మంచి పాత్రను పోషిస్తున్నాడు. ఆయన పాత్ర ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచుతుంది. కాగా తాజాగా ఈ సినిమా షూటింగ్‌లో నటుడు సునీల్ జాయిన్ అయ్యాడు. ఈ చిత్రంలో సునీల్ ఓ లాయర్ పాత్రలో నటిస్తున్నాడు. ఆయన కెరీర్‌ల్ ఇదొక డిఫరెండ్ పాత్రగా ఎప్పటికీ నిలిచిపోతుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ఈ చిత్రంలో నటుడు సునీల్ పవర్‌ఫుల్ లాయర్ శేఖర్ చంద్రగా కనిపించబోతున్నాడు. ఆయన పాత్ర సినిమా పెద్ద ఎస్సెట్‌గా ఉంటుంది. ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రతి మనిషి, ప్రతి నెలా



గుర్తుపెట్టుకునే డ్యూ డేట్ చుట్టు పూర్తి వాణిజ్య అంశాలతో అల్లుకున్న కథ ఇది. టైటిల్ దగ్గర నుంచి సినిమాలోని ప్రతి అంశం ప్రేక్షకులకు కొత్తదనంతో పాటు పూర్తి సంతృప్తిని కలిగించే కథ, కథనాలు ఈ చిత్రంలో ఉంటాయి. ఈ సినిమా ప్రేక్షకులకు ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించడంతో పాటు అందర్ని ఆలోచింపజేస్తుంది. హృదయాలకు హత్తుకుంటుంది' అన్నారు. లోమేష్ పుడిపెద్ది, జయశ్రీ, ప్రణీత పట్నాయక్, విజ్ఞాని, సునీల్ కృష్ణ భగవాన్,అక్షర గౌడ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: జవ్వాడి నాయుడు, మాటలు: హరీష్ మీనన్, ఎడిటర్: సత్య గిడుటూరి, డీఓపీ: చెంచు జింక, నిర్మాతలు పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను, దర్శకత్వం: ఆనంద్.కె.

## ఏకపక్షం కాదు... ఉభయపక్ష ప్రేమే బంధానికి బలం
## పరస్పర ప్రేమలోనే జీవిత సౌందర్యం

**త్రినేత్ న్యూస్, అక్టోబర్ 15:**

తను నేను చాలా రోజులుగా ప్రేమించుకున్నాం. పెళ్లి గురించి తన ఇంటికి వచ్చి, తన తల్లిదండ్రులతో మాట్లాడుమని అడిగింది. నేను వెళ్లి మాట్లాడాను. వారు మొదట్లో ఒప్పుకోలేదు. ఆఖరికి వాళ్ళ కాళ్లు పట్టుకొని బ్రతిమాలినా కూడా వాళ్ళ మనసు కరగలేదు. చివరికి మా స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నాను. నేను ఉద్యోగం చేయలేను అని తను చెప్తే కుటుంబాన్ని నడపడం కోసం ఓవర్ టైం చేస్తూ నేనే సంపాదిస్తున్నాను. కొన్ని రోజులకు "మా అమ్మానాన్న గుర్తుకు వస్తున్నారు. ఎలాగైనా వాళ్ల దగ్గరికి నన్ను తీసుకెళ్ళు" అని అడిగింది. తను బాధపడకూడదు అని మళ్లీ వాళ్ల తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి, వాళ్ళ అనుమతి లేకుండా పెళ్లి చేసుకున్నందుకు నన్ను క్షమించమని ప్రాధేయపడి, తనను వాళ్ల తల్లిదండ్రుల దగ్గర కొన్ని రోజులు ఉండమని చెప్పి వచ్చేసాను.

వారం రోజుల తర్వాత తను నాకు ఫోన్ చేసి "అమ్మానాన్నలను నేను వదిలి వెళ్ళినందుకు చాలా బాధపడుతున్నారు. వాళ్ళ బాధ చూడలేకపోతున్నాను. ఇక నన్ను మరిచిపో." అని చెప్పి ఫోన్ పెట్టేసింది. నా నంబర్ బ్లాక్ చేసింది. ఎలాంటి కమ్యూనికేషన్ లేదు తనతో. వాళ్ళ ఇంటి దగ్గరికి వెళ్తే అమ్మాయితో నన్ను మాట్లాడనివ్వడం లేదు. నాకు ఏం చేయాలో తోచడం లేదు. నాలుగు రోజులైంది సరిగ్గా తిండి తిని. కంటి మీద కునుకులేదు. నా భార్య మళ్ళీ నా దగ్గరికి వచ్చేలాగా నాకు సాయం చేయండి." అంటూ లాయర్ దగ్గర వేడుకున్నాడు.

ఇదంతా విన్న ఆ లాయర్ అతన్ని ఒక ప్రశ్న అడిగాడు " మీరు ఒకరినొకరు ప్రేమించుకున్నారు అని చెప్పారు. వాళ్ల తల్లిదండ్రులను కాళ్లు పట్టుకొని మరీ ప్రాధేయ పడ్డావు, దూరంగా తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నావు, ఉద్యోగం చేసి సంపాదిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నావ్, మళ్లీ వాళ్ళ తల్లిదండ్రుల దగ్గరికి తీసుకెళ్లి అప్పగించావు, ఆమె తిరిగి రాలేదని మానసికంగా ఇంత క్షోభ అనుభవిస్తున్నావ్. ఇందులో నీ ప్రేమ కనబడుతుంది కానీ ఆమె ప్రేమ ఎక్కడుంది?" అని అడిగాడు.

ఇలాంటి సందర్భాలు చాలా చూస్తుంటాం మనం కూడా. ఎదుటి వాళ్లకి నచ్చేలా మనం ఉండాలని వాళ్లకు నచ్చినట్టు ప్రవర్తిస్తూ, వాళ్ల క్షేమం పదేపదే కోరుకుంటూ, ప్రతి నిమిషం వాళ్ల గురించి ఆలోచిస్తూ, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వాళ్ళు ఏం చేసినా పోనీలే అని సర్దుకుంటూ, కొన్నిసార్లు బాధపెట్టినా ఎప్పటికైనా అర్థం చేసుకుంటారులే అనుకుంటూ,




మళ్లీ మళ్లీ వాటినే భరిస్తూ ఇదంతా "ప్రేమే" అని అనుకుంటారు.

కానీ "తనను కోల్పోకూడదు" అని ఇన్ని ప్రయత్నాలు చేసే క్రమంలో అసలు నిన్ను నువ్వు ఎప్పుడు కోల్పోయావు? ఎంతలా కోల్పోయావో కూడా ఒక్కసారి ఆలోచించు. కలిసి ఉండడం వేరు, కలిసి బ్రతకడం వేరు. జీవితాంతం ఇద్దరు కలిసి ఉండడానికి ఒక్కరి ప్రేమే సరిపోదు. ఇద్దరి వైపు నుండి ఉండాలి. ప్రేమ ఒకరిది కాదు, ఇద్దరిది.

ఒకరికొకరు సమయం కేటాయించుకోగలగాలి, ఒకరికొకరు అర్థం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఒకరి వల్ల మరొకరికి బాధ కలగకుండా ఉండేలా ప్రవర్తనలో చిన్న మార్పులు చేసుకోగలగాలి. ఒకరి కష్టంలో ఒకరు తోడుగా నిలబడగలగాలి. ఒకరి ఎదుగుదలను ఒకరు మనస్ఫూర్తిగా అభినందించగలగాలి. కలిసి ప్రయాణించే జీవితంలో నిర్ణయాలను ఇద్దరూ కలిసి తీసుకోగలగాలి. అది కదా ప్రేమంటే.

ఎంతసేపు ఒకరే ఆలోచిస్తూ, ఒకరే అర్థం చేసుకుంటూ,ఒకరే ఆ బంధాన్ని నిలబెట్టాలని ప్రయత్నం చేస్తూ ఉంటే అది ప్రేమ అని అనుకోవడం భ్రమ మాత్రమే.

**చివరిగా ఒక్క మాట:**

నీ మానసిక ప్రశాంతతని దెబ్బతీసే ఏ బంధం ప్రేమ కాదు. ఒక్కసారి ఆలోచించు. దేనికోసం నీ ఆలోచనలను, సమయాన్ని, నీ సామర్థ్యాన్ని పణంగా పెడుతున్నావు? నిన్ను నిన్నుగా కోరుకునే వ్యక్తి కోసమా? వాళ్లకు కుదిరినప్పుడు మీకు సమయం కేటాయించే వాళ్లకోసమా?

\M. Jaya Krishna Reddy
M.S. (Counselling & Psychotherapy)
Motivational Speaker

## అబ్దుల్ కలాం సేవలు అపూర్వం
## మార్చ్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి.



**ఏలేశ్వరం త్రినేత్ న్యూస్, అక్టోబర్ 15:**

మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు అపూర్వమని మార్స్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ మరియు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ నిర్వాహకులు అడపా దుర్గారావు అన్నారు. గురువారం కలాం జయంతి పురస్కరించుకొని స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద మండల యూటీఎఫ్ నాయకులు, మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నేతృత్వంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కోరాడ రాజు, గోళ్ళ విజయ్, తెల్ల ప్రియాంక, కుంజం విజయ, ఇందిర, నూకరత్నం, గౌరీ పార్వతి, బ్లెస్సి, మంజు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్. నాగప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుకె.రవి,జిల్లాకార్యదర్శిజె.సోమరాజు,ఉపాధ్యాయులు గిరిశ్వరరావు, తూమురౌతు. శ్రీనివాసరావు, భాస్కర్, చిన్నారావు, రామకృష్ణరెడ్డి, పి. సుబ్బారావుతదితరులు పాల్గొన్నారు

## "రణబాలి" సినిమాలోని జయమ్మ పాత్ర స్ఫూర్తితో 400 కుటుంబాలకు 3 నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించిన హీరోయిన్ రశ్మిక

ఏడాది పాటు ఈ సేవా కార్యక్రమం కొనసాగిస్తానని వెల్లడించిన రశ్మిక, రశ్మికను చూసి గర్వపడుతున్నానని స్పందించిన విజయ్ దేవరకొండ

సేవా కార్యక్రమాలతో తన గొప్ప మనసు చాటుకుంటున్నారు హీరోయిన్ రశ్మిక మందన్న. తన కొత్త సినిమా రణబాలిలో జయమ్మ పాత్ర స్ఫూర్తిగా రశ్మిక అన్నపూర్ణ అనే సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా 8 వివిధ ప్రాంతాలకు చెందిన 400 కుటుంబాలకు 3 నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు. ఏడాది పాటు ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తానని ఆమె వెల్లడించారు. రశ్మిక చేపట్టిన అన్నపూర్ణ ప్రాజెక్ట్ పట్ల విజయ్ దేవరకొండ సంతోషాన్ని వ్యక్తం చేశారు. రశ్మికను చూస్తుంటే గర్వంగా ఉందంటూ స్పందించారు. మరోవైపు నెటిజన్స్ పెద్ద సంఖ్యలో రశ్మిక సేవా కార్యక్రమాన్ని అప్రిషియేట్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా

హీరోయిన్ రశ్మిక స్పందిస్తూ - జయమ్మ పాత్రకు మీకు ఏవైనా పోలికలు ఉన్నాయా అని మీరు నన్ను అడుగుతుంటారు. నేను అవుననే సమాధానం ఇస్తాను. మీరు నాపై చూపించే ప్రేమకు కృతజ్ఞతగా ఇలాంటి మంచి పనులు చేస్తుంటాను కానీ ఎవరికీ చెప్పలేదు. నాకు, నా టీమ్ కు తెలిస్తే చాలు అనుకున్నాను. కానీ మిమ్మల్ని కూడా నా సేవా కార్యక్రమం ఇన్స్ పైర్ చేస్తుందనే కారణంతో ఇప్పుడు చెబుతున్నాను. నేను ఈరోజు 400 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. ఒకేసారి 400 కుటుంబాలకు ప్రతి 3 నెలల చొప్పున సహాయం చేస్తూ, ఏడాది పొడవునా దీనిని కొనసాగించాలనుకుంటున్నాను. ఆ నిత్యావసర సరుకుల డబ్బును పొదుపు చేసుకుని, రాబోయో రోజులకు దాచుకుంటారని ఆశిస్తున్నాను. అని అన్నారు.విజయ్ దేవరకొండ స్పందిస్తూ - ఇలాంటి






మంచి కార్యక్రమాలు నువ్వు ఎప్పటి నుంచో చేస్తున్నావు కానీ ఎవరికీ తెలియనివ్వలేదు. ఇప్పుడు నువ్వు చేపట్టిన అన్నపూర్ణ ప్రాజెక్ట్ ఏడాది పాటు 400 కుటుంబాలకు అండగా నిలబడుతుంది. వాతావారణ మార్పులతో కరువు పరిస్థితులు ఏర్పడుతున్న ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబాలను కాపాడుతుంది. నీ మంచి మనసుకు గర్వపడుతున్నాం. మనం ఎదగడమే కాదు మన వాళ్ల కోసం నిలబడదాం. అన్నారు.

విజయ్, దేవరకొండ రశ్మిక జంటగా నటించిన రణబాలి సినిమా ఈ నెల 16న గ్రాండ్ థియేట్రికల్







రిలీజ్ కు రాబోతోంది.

## ఘనంగా "జయహో రామానుజ" సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్, ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ

లయన్ డా. సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా "జయహో రామానుజ". ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్ లో సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్ గా నటిస్తుండగా..సుమన్, ప్రవల్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ నెల 24న "జయహో రామానుజ" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

హీరో, డైరెక్టర్ లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ - సినిమా ఇండస్ట్రీలో పాతికేళ్ల ప్రయాణం నాది. మా మొదటి సినిమా హీరో సుమన్ గారు. ఆయన ఇప్పటికీ అలుపెరుగక సినీ ప్రయాణం చేస్తున్నారు. "జయహో రామానుజ" చిత్రంలో మంచి క్యారెక్టర్ చేశారు. ఆధ్యాత్మిక విప్లవకారుడు రామానుజాచార్యుల జీవిత కథతో ఈ సినిమాను ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి రూపొందించాం. గొప్ప సినిమాలను ప్రజలు తండోపతండాలుగా థియేటర్స్ కు వెళ్లి చూస్తుంటారు. మా సినిమాకు కూడా అలాంటి ఆదరణే దక్కుతుందని నమ్ముతున్నాం. ఈ సినిమాను డబ్బుల కోసం రూపొందించలేదు. రామానుజాచార్యుల వారి గొప్ప కథను ఈ తరం వారికి చూపించాలని ప్రయత్నించాం.




టెక్నికల్ గా మంచి క్వాలిటీతో మా సినిమా ప్రేక్షకుల ముందుకు ఈ నెల 24న తీసుకొస్తున్నాం అన్నారు.

నటి, ప్రొడ్యూసర్ ప్రవల్లిక మాట్లాడుతూ - "జయహో రామానుజ" సినిమాను నిర్మించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. అందుకు మా నాన్న గారికి థ్యాంక్స్ చెబుతున్నా. ఈ సినిమాలో నిర్మాణ బాధ్యతల వహిస్తూనే పాటు కృష్ణుడు, నారదుడు, రఘునాథస్వామి పాత్రల్లో నటించాను. ఈ తరం ప్రేక్షకులకు రామానుజాచార్యుల వారి గొప్పదనం తెలియాలి. ఆయన జీవితం నుంచి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని నమ్మి ఈ సినిమాను నిర్మించాం అన్నారు.

నటుడు సుమన్ మాట్లాడుతూ - ఈ సినిమా గురించి సాయి వెంకట్ గారు చెప్పినప్పుడు చాలా కష్టంతో కూడుకున్న మూవీ కదా అన్నాను. ఆయన మేము ఈ సినిమాను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఆయన చాలా కన్విక్షన్ తో ఈ సినిమాను రూపొందించారు. ఈ సినిమాలో మంచి క్యారెక్టర్ చేసే అవకాశం దక్కింది. మన దేశంలో ఎన్నో మతాలు, కులాలు, వర్గాలు ఉన్నాయి. అయినా మనమంతా కలిసే ఉంటున్నాం. ఈ భావనకు మొదట కృషి చేసింది రామానుజాచార్యులవారు. మనమంతా ఒక్కటే అని ఆయన చెప్పిన గొప్ప మాటలు మనల్ని ఇప్పటికీ ఐక్యంగా నడిపిస్తున్నాయి. ఈ సినిమా మీ ఫ్యామిలీతో కలిసి సంతోషంగా చూడండి. రామానుజాచార్యులవారి గొప్పదనం తెలుసుకోండి అన్నారు.

నటీనటులు -- లయన్ సాయి వెంకట్, జో శర్మ, సుమన్, ప్రవల్లిక అశ్వాపురం వేణుమాధవ్, అప్పం పద్మ, తదితరులు

టెక్నికల్ టీమ్
ప్రెజెంట్స్ : సుదర్శనం హేమలత
బ్యానర్ : సుదర్శనం ప్రొడక్షన్స్
స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ : లయన్ సాయి వెంకట్
నిర్మాతలు : సుదర్శనం సాయి ప్రసన్న, సుదర్శనం ప్రవల్లిక
పి.ఆర్.ఓ : చందు రమేష్

## చిన్న సినిమాలను చంపేస్తున్నారు.. ఇండస్ట్రీ పెద్దలపై 'ఓ అందాల రాక్షసీ' హీరో షిరాజ్ మెహదీ ఫైర్!

**థియేటర్లు ఇవ్వరు.. ఓటీటీకి అమ్ముకోనివ్వరు.. శాటిలైట్ హక్కులకూ దారుల్లేవు**
**సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలి.. చిన్న నిర్మాతలను ఆదుకోవాలి**

**హైదరాబాద్, త్రినేత్ న్యూస్, అక్టోబర్ 15:**

సినిమా తీయడం ఒక ఎత్తయితే.. దాన్ని థియేటర్లలో విడుదల చేయడం మరో ఎత్తు! చిన్న సినిమా నిర్మాతలకు అసలు పరీక్ష సినిమా నిర్మాణం పూర్తయిన తర్వాతే మొదలవుతోందా? పెట్టుబడులు పెట్టి, అప్పులు చేసి సినిమాలు తీస్తున్న నిర్మాతలకు థియేటర్లు దొరకకపోవడం.. ఓటీటీ, శాటిలైట్ హక్కులు విక్రయించుకునే అవకాశాలు లేకపోవడం వెనుక ఎవరున్నారు? చిన్న సినిమాల విషయంలో తెలుగు చిత్ర పరిశ్రమలో వివక్ష కొనసాగుతోందా? 'ఓ అందాల రాక్షసీ' హీరో, నిర్మాత షిరాజ్ మెహదీ చేసిన సంచలన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

చిన్న సినిమాలకు థియేటర్లు ఇవ్వకుండా, వాటి వ్యాపార అవకాశాలను దెబ్బతీస్తున్నారంటూ పరిశ్రమలోని కొందరు ప్రముఖులు, సంస్థల తీరుపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చిన్న సినిమాల నిర్మాతల కష్టాలను పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

సినిమా తీయడమే నేరమా?

సినిమా నిర్మాణం కోసం నిర్మాతలు భారీగా డబ్బు ఖర్చు చేస్తున్నారని, ఎన్నో ఆశలతో సినిమా పూర్తి చేసిన తర్వాత విడుదల, వ్యాపారం విషయంలో మాత్రం ఇబ్బందులు

ఎదుర్కొంటున్నారని షిరాజ్ మెహదీ పేర్కొన్నారు. సినిమా తీయడానికి ముందుకొచ్చిన నిర్మాతకు, సినిమా పూర్తయిన తర్వాత అండగా నిలిచేవారు లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిలిం చాంబర్ వాళ్లు 'మీరు సినిమా ఎందుకు తీశారు?' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, ఇతరులు తీసే సినిమాలతో తమకు సంబంధం లేదన్న ధోరణిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. సినిమా నిర్మాణానికి ప్రోత్సాహం ఇవ్వకపోగా, విడుదల సమయంలోనూ అడ్డంకులు ఎదురైతే చిన్న నిర్మాతలు ఎవరిని



ఆశ్రయించాలని ప్రశ్నించారు. తెలుగు ఫిలిం చాంబర్ స్థానంలో తెలంగాణ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందేని డిమాండ్ చేశారు.

థియేటర్లు లేవు.. ఓటీటీ కొనదు.. నిర్మాత బతికేదెలా?లి

చిన్న సినిమాలకు థియేటర్లు కేటాయించకపోవడం, ఓటీటీ సంస్థలు, శాటిలైట్ ఛానెళ్ల ద్వారా హక్కులు విక్రయించుకునే అవకాశాలు పరిమితం కావడం నిర్మాతలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోందని షిరాజ్ మెహదీ ఆరోపించారు.

సినిమా కోసం డబ్బు పెట్టిన నిర్మాతకు పెట్టుబడి తిరిగి వచ్చే మార్గాలే మూసుకుపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. పెద్ద సినిమాలకు లభించే అవకాశాలు చిన్న సినిమాలకు ఎందుకు లభించడం లేదని నిలదీశారు. చిన్న చిత్రాల సమస్యలను పరిష్కరించకుండా వదిలేస్తే, కొత్త నిర్మాతలు, దర్శకులు, నటీనటులు పరిశ్రమలో నిలదొక్కుకోవడం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫిల్మ్ ఛాంబర్ ఏం చేస్తోంది?లి

చిన్న సినిమాల వ్యాపార సమస్యలపై ఫిల్మ్ ఛాంబర్ బాధ్యత తీసుకోవడం లేదని షిరాజ్ మెహదీ విమర్శించారు. నటీనటులు, దర్శకులు, నిర్మాతల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు పరిష్కారానికి ముందుకొచ్చే సంస్థలు, సినిమాల వ్యాపారం, విడుదల, హక్కుల విక్రయం వంటి అంశాల దగ్గరకు వచ్చేసరికి తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు విదేశీ మార్కెట్లలోనూ సినిమాల హక్కుల విక్రయాలకు పారదర్శకమైన విధానం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి సినిమాకు వ్యాపార అవకాశాలు కల్పించే వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు.

రైతు ప్రాణమే ప్రాణమా.. సినీ కార్మికుల ప్రాణాలు కావా?

చిన్న సినిమాల వెనుక ఎంతోమంది జీవితాలు, కుటుంబాల భవిష్యత్తు ముడిపడి ఉంటాయని షిరాజ్ మెహదీ భావోద్వేగంగా పేర్కొన్నారు. ఒక రైతు నష్టపోయినా, ప్రాణాలు కోల్పోయినా సమాజం స్పందిస్తుందని.. మరి సినిమా కోసం అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి నష్టపోయే నిర్మాతలు, దర్శకులు, నటీనటుల పరిస్థితిని ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నించారు. సినిమా రంగంలోనూ చిన్న నిర్మాతల సమస్యలను మానవీయ కోణంలో చూడాలని, వారి ఆర్థిక ఇబ్బందులను తేలికగా తీసుకోకూడదని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చిన్న సినిమాలను ఆదుకోవాలని షిరాజ్ మెహదీ విజ్ఞప్తి చేశారు. చిన్న బడ్జెట్ చిత్రాలకు సబ్సిడీలు అందించడం, థియేటర్ల కేటాయింపుల్లో పారదర్శకత తీసుకురావడం, ఓటీటీ, శాటిలైట్ హక్కుల విక్రయాలకు అవకాశాలు పెంచడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం చొరవ తీసుకుంటే చిన్న సినిమాలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉన్న సమయంలో పరిశ్రమలో నెలకొన్న పరిస్థితులను ప్రస్తావిస్తూ, తెలంగాణ ప్రభుత్వం కూడా చిన్న నిర్మాతల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

**లీగల్ నోటీసులు పంపినా స్పందన లేదు**

ఐనాక్స్, పీవీఆర్, ఏషియన్ ఫిలిమ్స్, నిర్మాత సురేష్ బాబు, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు తదితరులకు లీగల్ నోటీసులు, గ్రీవెన్స్ పిటిషన్లు పంపినప్పటికీ స్పందన రాలేదని షిరాజ్ మెహదీ వెల్లడించారు. తన సమస్యతో పాటు చిన్న సినిమాల నిర్మాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సంబంధిత సంస్థలు స్పందించాలని కోరారు.

## ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరానికి విశేష స్పందన....

## - కవిత పృథ్వీరాజ్, అడపా చంద్రమౌళిలు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినం దనీయం...





**ట్రైనెట్ న్యూస్, హైదరాబాద్ అక్టోబర్ 15 :**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినో త్సవాన్ని పురస్కరిం చుకొని సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంబర్ పేట శివంరోడ్డులోని ఎన్ఎస్.టిఐ క్యాంపస్ నిర్వహించిన ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మ హిళా మోర్చా అధికార ప్రతినిధి నలువాల కవిత పృథ్వీరాజ్, మాజీ కార్పొరేటర్ అడపా చంద్ర మౌళి సంయుక్త ఆధ్వ ర్యంలో నిర్వహిం చిన వైద్య శిబిరానికి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ గౌతమ్ రావు, సెం ట్రల్ జిల్లా బిజెపి ప్రధాన కా ర్యదర్శి ఏడెల్లి అజ య్ కుమార్ లు హాజరయ్యారు. శ్రీకర హాస్పిటల్స్ పలువురు వైద్యు లు హాజరై హెల్త్ క్యాంప్ లో బీపీ, షుగర్, చెకప్, గైనిక్, కంటి, దంత, యూరాలజీ, కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్, ఈసీ జీ, తదితర పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్.టిఐ శిక్షణ పొందు తున్న విద్యా ర్థిని, విద్యార్థులు, ఉద్యోగులు, పలువురి పేద ప్రజలకు.. 520 మందికి వైద్య పరీక్ష లు నిర్వహించి అవసరమైన ఉచితంగా మందులు అందజే శారు. పలువురు ప్రముఖులు, యువత ఉత్సాహం గా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం గౌతమ్ రావు మాట్లాడుతూ... పేద మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందిం చాలనే ఉ ద్దేశంతో వైద్య శిబిరం ఏర్పా టు చేయడం గొప్ప విషయం అన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని యువత సామాజిక సేవలో భాగస్వా ములు కావాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన కవిత పృథ్వీరాజ్, మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళిని శాలువతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్ర మంలో బాగ్ అంబర్ పేట డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు కనకలక్ష్మీ, బిజెపి నేతలు ఆర్. రాంరెడ్డి, అడపా జనార్ధన్, పృథ్వీరాజ్, ఎన్ఎస్.టిఐ అధి కారులు, ఉద్యోగుల సిబ్బంది, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆలూరు పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం.

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

ఆలూరు పోలీస్ స్టేషన్ లో అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలూరు పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా రక్తదానం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయం అందించాలనే సందేశాన్ని ఇచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒక్కరు చేసే రక్తదానం పలువురి ప్రాణాలను కాపాడే అవకాశం కల్పిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, మానవతా దృక్పథంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ద్వారా పోలీసు శాఖ సామాజిక బాధ్యతను చాటుకుంది. ప్రజల ప్రాణాల రక్షణతో పాటు సమాజ సేవలోనూ పోలీసు శాఖ ముందుంటుందని ఈ కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నెట్టప్ప, కర్నూలు జిల్లా వడ్డెర్ల కార్పొరేషన్






అధ్యక్షురాలు శ్రావణి వాసు, రమేష్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాయిసన్నిధిలో అంగరంగ వైభవంగా ఐదవ రోజు ఉత్సవాలు



**- ఆలయ ట్రస్ట్ చైర్మన్ మంచికంటి ధనంజయ ఆధ్వర్యంలో 5వ రోజు ఘనంగా పూజా కార్యక్రమం**

**-ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీనటి హరికథా శ్రీ ఆదిపట్ల శ్రీ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు కరాటే కళ్యాణ**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

మండల కేంద్రంలోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీ సాయిసన్నిధిలో జరుగుతున్న ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు కార్యక్రమాలను దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

**అమ్మవారి దివ్య దర్శనం - ప్రత్యేక పూజలు**

ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజున భక్తుల పూజలందుకునేందుకు అమ్మవారు లలితా త్రిపుర సుందరి దివ్య అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం 10:00 గంటలకు ఆలయంలో అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య కుంకుమార్చన మరియు శక్తివంతమైన లలితా సహస్రనామ పారాయణము ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

**108 కలశాలతో చక్కెర అభిషేకం**

మధ్యాహ్న సమయంలో బాబావారికి ప్రత్యేక హారతి సమర్పించిన అనంతరం, భక్తుల సమక్షంలో అత్యంత విశేషంగా 108 కలశాలతో చక్కెరతో ప్రత్యేక అభిషేకం కన్నులపండువగా చేపట్టారు. ఈ విశేష అభిషేకంలో పాల్గొనడం వలన సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆకట్టుకున్న 'శ్రీ వల్లి కళ్యాణం' హరికథా గానం

ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సినీనటి, హరికథా చూడామణి, శ్రీ ఆదిపట్ల శ్రీ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు కరాటే కళ్యాణి ఆలపించిన 'శ్రీ వల్లి కళ్యాణం' హరికథా గానం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఆమె సుమధుర గళంతో, అభినయంతో సాగిన హరికథా ప్రవచనం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ఉపన్యాస సరళి మరియు భక్తి భావాన్ని చాటిచెప్పిన తీరు అందరినీ ఆకట్టుకుంది.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం దేవస్థాన కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కురిమిశెట్టి వెంకటయ్య, ఊరే కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమల్ల శ్రీను, ఆలయ పూజారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా భక్తులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వామివారి, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## స్థానిక భాషల్లో డిజిటల్ సేవలకు 'భాషిణి' తోడ్పాటు

## మణిపూర్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం బహుభాషా కృత్రిమ మేధ, భాషా సాంకేతికత అభివృద్ధిపై దృష్టి

**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

స్థానిక భాషల్లో ప్రభుత్వ డిజిటల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు డిజిటల్ ఇండియా భాషిణి విభాగం (డీఐబీడీ), మణిపూర్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. అక్టోబర్ 14న ఇంఫాల్‌లో నిర్వహించిన 'భాషిణి రాజ్యం--మణిపూర్ చాప్టర్' కార్యశాలలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. బహుభాషా కృత్రిమ మేధ అభివృద్ధి, స్థానిక భాషా వనరుల బలోపేతం, ప్రభుత్వ సేవల్లో భాషా సాంకేతికత వినియోగంపై కార్యశాలలో చర్చించారు.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌కు చెందిన భాషిణి విభాగం, మణిపూర్ ఐటీ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ హాజరయ్యారు. భాషిణి సీఈఓ అమితాబ్ నాగ్, మణిపూర్ ఐటీ శాఖ కార్యదర్శి సోమోర్జిత్ సలామ్ ఆయా సంస్థల తరఫున ఒప్పందంపై సంతకాలు చేశారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని ప్రోత్సహించడంలో కృత్రిమ మేధ, భాషా సాంకేతికత కీలక పాత్ర పోషించగలవని ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ సింగ్ పేర్కొన్నారు. మణిపూర్‌లోని మరిన్ని భాషలను డిజిటల్ వేదికలపైకి తీసుకురావడం ద్వారా ఆయా సమాజాలకు కొత్త అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. భాషా వైవిధ్యం దేశానికి విలువైన బలమని



అభిప్రాయపడ్డారు.

**ఆంగ్లం నుంచి మణిపురికి తక్షణ అనువాదం**

కార్యశాలలో ఆంగ్లం నుంచి మణిపురి భాషలోకి తక్షణ అనువాదాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ప్రభుత్వ వేదికలు, ప్రజాసేవల అప్లికేషన్లలో బహుభాషా సేవలనుఅనుసంధానించే అవకాశాలను వివరించారు. విద్య, వైద్యం, న్యాయ సేవలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఈ సాంకేతికత వినియోగంపై చర్చించారు.ప్రజలు అర్థం చేసుకొని, నమ్మకంగా వినియోగించగలిగినప్పుడే డిజిటల్ సేవలు సమర్థంగా పనిచేస్తాయని సోమోర్జిత్ సలామ్ అన్నారు. మణిపూర్ అవసరాలకు అనుగుణంగా పరీక్షించిన భాషా పరిష్కారాలతో సేవల వినియోగంలో అడ్డంకులను తగ్గించవచ్చని తెలిపారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని కృత్రిమ మేధ అర్థం చేసుకోవాలని, డిజిటల్ సేవలు పొందేందుకు భాష అవరోధంగా మారకూడదని అమితాబ్ నాగ్ పేర్కొన్నారు.

**భాషా నిపుణులు, స్థానిక సమాజాల భాగస్వామ్యం**

మణిపురి, తాంగ్‌ఖుల్, థడౌ, పైతే, హ్మార్, లియాంగ్‌మై తదితర భాషలకు సంబంధించిన డిజిటల్ వనరులను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని కార్యశాల ప్రస్తావించింది. స్థానిక భాషా నిపుణులు, ఆయా సమాజాల సహకారంతో సమాచారాన్ని సేకరించడం, భాషా నమూనాల పనితీరును ధ్రువీకరించడం ద్వారా ప్రజలకుఉపయోగపడేపరిష్కారాలనురూపొందించాలని సూచించారు.డెవలపర్లు, విద్యార్థులు, ఆవిష్కర్తల కోసం నిర్వహించిన 'భాషిణి శిల్పి' కార్యక్రమంలో భాషా ఆధారిత కృత్రిమ మేధతో అప్లికేషన్ల రూపకల్పన అవకాశాలను పరిచయం చేశారు. 'భాషిణి మిత్ర' ద్వారా విద్యా సంస్థలు, భాషా సమాజాలు స్థానిక భాషా సమాచారాన్ని అందించి బహుభాషా వనరుల అభివృద్ధిలో భాగస్వాములు కావచ్చని వివరించారు.

ఒప్పందంలో భాగంగా ప్రాధాన్య సేవలను గుర్తించడం, వాటికి అవసరమైన భాషా సమాచారాన్ని అంచనా వేయడం, సంబంధిత ప్రభుత్వ వేదికల్లో భాషిణి సాంకేతికతను అనుసంధానించే అవకాశాలను పరిశీలించనున్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పరిష్కారాలను అభివృద్ధి చేసి పరీక్షించడంపై రెండు పక్షాలు దృష్టి సారించనున్నాయి. ప్రస్తుతం భాషిణి 800కు పైగా ప్రభుత్వ వెబ్‌సైట్లకు బహుభాషా సేవలను అందిస్తోంది. పాఠ్య సేవలకు 36 భారతీయ భాషలు, వాయిస్ సేవలకు 23 భారతీయ భాషలతోపాటు 35 అంతర్జాతీయ భాషలకు మద్దతు ఇస్తున్నట్లు డీఐబీడీ తెలిపింది.

## ఎల్‌నినో ముప్పును సమష్టిగా ఎదుర్కొందాం.. నీటిని పొదుపుగా వాడుకుందాం: సీఎం రేవంత్ రెడ్డి

## రైతులు యాసంగి పంటల సాగును తగ్గించుకోవాలి.. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలి

**-విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు చేరింది.. కేంద్రం సహకరించాలి**

**-అఖిలపక్ష సమావేశం నిర్వహించి, కేంద్ర మంత్రులను కలుస్తాం**

**-ప్రజలు, రైతులు, రాజకీయ పార్టీలు, మీడియా సహకారం అవసరం**




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో రానున్న 8 నుంచి 10నెలల్లోఎదురయ్యేసవాళ్లను సమష్టిగా ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తీవ్ర ఎండలు, తాగునీటి కొరత, విద్యుత్ డిమాండ్ పెరుగుదల, వ్యవసాయ రంగంపై ప్రభావం వంటి సమస్యలనుదృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. అందుబాటులో ఉన్న మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించినట్లు వెల్లడించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండటంతో పాటు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని కోరారు.

**నీటి కొరతపై ఆందోళన**

రాష్ట్రంలో నీటి లభ్యతపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం, గోదావరి బేసిన్‌లో 40 శాతం మేర తక్కువగా ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో 23 శాతం వర్షపాతం లోటు నమోదైందని, 460 టీఎంసీల నీరు అందుబాటులో ఉండాల్సిన పరిస్థితుల్లో ప్రస్తుతం కేవలం 209 టీఎంసీలే ఉన్నాయని పేర్కొన్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలోని సుమారు 24 వేల గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాల్సి ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నీటిని కొనుగోలు చేయగలిగినా, నీటినే కొనలేని పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తూ.. ప్రతి చుక్కను ఆదా చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బండ్లు, కార్లు కడగడానికి తాగునీటిని వృథా చేయవద్దని సూచించారు.

**యాసంగి సాగును తగ్గించుకోవాలి**

తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం అధికంగా ఉన్న నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం కోరారు. రాష్ట్రంలో 56 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 13 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసినట్లు తెలిపారు. రానున్న సీజన్‌లో వరి సాగును వాయిదా వేసుకోవాలని, యాసంగిలో పంటలు వేయడాన్ని తగ్గించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మి వరి నాట్లు వేస్తే నారుమడి దశలోనే పంట ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నీటి కొరత కారణంగా రైతులు పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం చేతికొచ్చే దశలో ఉన్న వానాకాలం పంటలను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు. సుమారు 10 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయే ప్రమాదం ఉందని నివేదికలు అందినట్లు పేర్కొన్నారు.

**విద్యుత్ డిమాండ్‌లో భారీ పెరుగుదల**

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని రేవంత్ రెడ్డి తెలిపారు. సాధారణంగా అక్టోబర్‌లో 15 వేల మెగావాట్ల స్థాయిలో ఉండాల్సిన డిమాండ్ ప్రస్తుతం 20 వేల మెగావాట్లకు చేరిందన్నారు. ఒక రోజులో 20,003 మెగావాట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు వివరించారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల పంప్‌సెట్లు పనిచేస్తుండటంతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగాయని చెప్పారు.

గత 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల అదనపు విద్యుత్ డిమాండ్ పెరిగిందని, ప్రస్తుత ప్రభుత్వ రెండేళ్ల కాలంలోనే మరో 6 నుంచి 7 వేల మెగావాట్ల మేర డిమాండ్ పెరిగినట్లు తెలిపారు. అధిక డిమాండ్‌ను తట్టుకుంటూ రైతులకు, గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు అధికారులను అభినందించారు. వానాకాలం పంటలు మరో 20 రోజుల్లో కోతకు వచ్చే అవకాశం ఉన్నందున పంటలు ఎండిపోకుండా మార్కెట్‌లో ఎంత ధరకు విద్యుత్ లభించినా కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పొరుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాలు విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నాయని, విద్యుత్ ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను సేకరించి అవసరమైన రాష్ట్రాలకు తక్కువ ధరకు అందించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు.

**రైతులకు కేంద్రం అండగా నిలవాలి**

వానాకాలంలో పంట నష్టపోయిన రైతులతో పాటు నీటి కొరత కారణంగా తదుపరి సీజన్‌లో సాగు చేయలేని రైతులను కూడా కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు సమకూర్చే పథకాల ద్వారా రైతులకు సహాయం అందించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కేంద్రం నుంచి ఉదారంగా ఆర్థిక సాయం పొందేందుకు అవసరమైన నివేదికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దేశంలో ఎప్పుడు సంక్షోభం వచ్చినా రైతాంగం ముందుండి నిలబడిందని, రైతులు దేశానికి వెన్నెముకగా నిలిచారని పేర్కొన్నారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లోనూ రైతులు ప్రభుత్వానికి సహకరించాలని, నీటి లభ్యతను బట్టి సాగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

**ఉపాధి హామీ పనులతో చెరువుల పునరుద్ధరణ**

నీటి కొరతతో పాటు ఉపాధి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని సీఎం తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో ఉపాధి హామీ పనుల్లో 25 వేల మంది పాల్గొనగా, ప్రస్తుతం రెండున్నర లక్షల మంది పనులు చేస్తున్నారని వివరించారు. ఉపాధి హామీ పథకం కింద చెరువులు, కుంటల మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నీటి వనరులను పునరుద్ధరించడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను కొంతవరకు అధిగమించవచ్చని పేర్కొన్నారు.

**పశువులు, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి**

ఎండలు, వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రజలు, పశువులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి తెలిపారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. పేదలకు ఏ కష్టం వచ్చినా తక్షణమే ఆదుకునేలా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.

**అఖిలపక్ష సమావేశం.. ఢిల్లీకి ప్రతినిధి బృందం**

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కోవిడ్ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా రాష్ట్రం సహకరించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుత సంక్షోభంలోనూ అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. దసరా తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరిస్తామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి నాయకత్వంలో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రితో పాటు ఇతర కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి అవసరమైన సహాయంపై చర్చిస్తామని వెల్లడించారు.

ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు

ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కళాజాతాలు నిర్వహిస్తామని సీఎం తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు, నిపుణులు పత్రికల్లో వ్యాసాలు రాయాలని కోరారు. సినీ నటుడు విజయ్ దేవరకొండ ఇప్పటికే ఎల్‌నినోపై ప్రజలకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఇతర సినీ నటులు, క్రీడాకారులు, కళాకారుల సహకారంతో ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని చెప్పారు.

మీడియా సహకారం ఈ సమయంలో అత్యంత అవసరమని పేర్కొంటూ, మీడియా కోసం ప్రభుత్వ తరఫున నోడల్ అధికారిని నియమించి టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా ప్రభుత్వ సూచనలను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజలు, రైతులు, అన్ని రాజకీయ పార్టీలు, మీడియా, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తే ఈ సంక్షోభాన్ని విజయవంతంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

# అండర్--13 విభాగంలో సత్తా చాటిన మ్యాచ్ పాయింట్ చిన్నారులు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ :**
ఇటీవల బీహార్‌లోని పాట్నాలో అక్టోబర్ 10 నుంచి 15 వరకు జరిగిన అండర్--13 ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారిణులు ప్రతిభ కనబరిచారు. భవనాసి సాన్వి, దేవరం శ్రీనిధి బాలికల డబుల్స్ విభాగంలో మెయిన్ డ్రాకు అర్హత సాధించగా, లట్టాల సాన్వి సింగిల్స్, డబుల్స్ రెండు విభాగాల్లోనూ మెయిన్ డ్రాలో స్థానం సంపాదించింది.జాతీయ స్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో మ్యాచ్ పాయింట్ క్రీడాకారిణులు సాధించిన విజయాలు అకాడమీకి గర్వకారణంగా నిలిచాయని మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు చైర్మన్, ప్రధాన కోచ్ వేణు ముప్పాల తెలిపారు. చిన్న వయసులోనే ఉన్నత స్థాయి పోటీల్లో




పాల్గొంటూతమప్రతిభనుచాటుకోవడం అభినందనీయమన్నారు . క్రీడాకారిణులు మరింత కష్టపడి సాధన చేస్తూ.. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కలాం జీవితాన్ని ఆదర్శం గా గ్రహించాలి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 15:**
అబ్దుల్ కలాం చిన్న నాటి నుంచి విద్య పట్ల ఆసక్తి తో పాటు చదువు పూర్తి చేసుకోవాలన్న తపన తో పేపర్ బాయ్ వంటి పనులు కూడా చేస్తూ తను అనుకున్న అంతరిక్ష రంగం లో ఉన్నత స్థాయి కి చేరారు అని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ అధ్యక్షులు నాయుడు సత్యనారాయణ చెప్పారు ప్రతి ఒక్కరూ తమ రంగం లో ఉన్నత స్థాయి చేరేందుకు కలాం జీవితాన్ని ఆదర్శం గా తీసుకోవాలి అని అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై భారత పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జన్మ దినోత్సవం గాన సభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ కలాం




భారత దేశ అత్యున్నత పదవి రాష్ట్ర పతి గా వున్న సమయం లోనూ అతి నిరాడంబర జీవితం నిస్వార్థ సేవ దృక్పథం తో గడిపిన మహావ్యక్తి అని కొని యాడారు ఆయన పదవీ విరమణ చేసిన తర్వాత తన కి ఇష్టం ఇన బోధనా రంగాన్ని ఎంచుకొని ఆ క్రమంలో ప్రసంగిస్తూ మృతి చెందటం తో దేశం ఒక గొప్ప శాస్త్రవేత్త ను కోల్పోయింది అని అన్నారు




గాన సభ ఆయన జయంతి నాడే కార్యక్రమం జరిపి కలాం పై వారికున్న అభిమానం చూపారు అని అభినందించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయకుడు వెన్నెల సుబ్రహ్మణ్యం గాన సభ సభ్యురాలు దేవ సేన బాల సాహిత్య రచయిత చొక్కాపు రమణ తదితరులు పాల్గొన్నారు

# బతుకమ్మ వేడుకలకు హాజరైన మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్







**హైద్రాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్,15**
.బన్సీలాల్ పేట లోని చారిత్రక మెట్ల బావి వద్ద ఘనంగా బతుకమ్మ వేడుకలు
మహిళలతో కలిసి బతుకమ్మ లో స్టెప్పులు వేసిన తలసాని శ్రీనివాస్ యాదవ్
ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు పూలతో ఘన స్వాగతం పలికి న మహిళలు
బతుకమ్మ వేడుకలలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

# బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, సంప్రదాయాలకు ప్రతీక: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

## లోక్ భవన్ లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 15,**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు , స్త్రీశక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల్లో ప్రకృతి పట్ల ఆరాధనాభావాన్ని, సాంస్కృతిక వారసత్వం పట్ల గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా అన్నారు. పుష్పాలనే దైవ స్వరూపంగా భావించి పూజించే ప్రకృతి ఉత్సవం బతుకమ్మ పండుగ అని గవర్నర్ పేర్కొన్నారు .

గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన తన సతీమణి జానకి శుక్లాతో కలిసి పాల్గొని, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, శాంతి, ఆరోగ్యం, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.

ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, పూలతో అలంకరించిన బతుకమ్మ ప్రకృతి సౌందర్యానికి, జీవన వైభవానికి, మానవాళికి ప్రకృతితో ఉన్న విడదీయరాని అనుబంధానికి ప్రతిబింబమని అన్నారు. ప్రకృతిని పరిరక్షించడం, సహజ వనరులను గౌరవించడం, పర్యావరణం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి విలువలను ఈ పండుగ చాటిచెబుతుందని తెలిపారు.

బతుకమ్మమహిళలసృజనాత్మకతకు ఆత్మగౌరవానికి, సామాజిక భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. జానపద గీతాలు, కళలు, సంప్రదాయ ఆచారాల ద్వారా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని సజీవంగా నిలుపుతున్న మహిళల పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ అమూల్యమైన వారసత్వాన్ని పరిరక్షించి, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.ప్రకృతి పరిరక్షణ, మహిళా సాధికారత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సామాజిక సామరస్యానికి ప్రాధాన్యమిస్తూ తెలంగాణ పురోగతి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

**వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు**
లోక్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో సుమారు 400 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు . తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు , లోక్‌భవన్ మహిళా ఉద్యోగులు , వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. గౌరీదేవి ప్రతిరూపాల చుట్టూ మహిళలంతా చేరి, చప్పట్లు కొడుతూ, లయబద్ధంగా ఉయ్యాల పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. కోలాటాల కోలాహలంతో అమ్మవారికి నీరాజనాలు పట్టారు. కుటుంబ క్షేమాన్ని కాంక్షిస్తూ, తమ సౌభాగ్యాన్ని నిండు నూరేళ్లు కాపాడమంటూ ఆ తల్లిని మనసారా వేడుకున్నారు. అనంతరం బతుకమ్మలను గవర్నర్



సతీమణి శ్రీమతి జానకి శుక్లా, మహిళా ఉద్యోగినులు లోక్ భవన్ లోని కొలనులో నిమజ్జనం చేశారు. కోలాట బృందాల సందడి, బతుకమ్మ పాటల మధురిమతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ కళను సంతరించుకోనుంది. రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో... లోక్ భవన్‌బతుకమ్మ పండుగ వేళ లోక్ భవన్ రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో జిగేల్‌మంటూ వెలిగిపోయింది. పూల పండుగైన బతుకమ్మకు ఈ విద్యుత్ కాంతులు అదనపు శోభను ఇచ్చాయి.వేడుకల్లో గవర్నర్ సంయుక్త కార్యదర్శి శశికిరణ్ కోమండూర్ , ఉప కార్యదర్శి పల్లవి , ప్రెస్ సెక్రెటరీ మామిండ్ల దశరథం ,అధికారులు , ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు .

# సి.రాయవరంలో కనకదుర్గ ఆలయంలో ఘనంగా కలశపూజ, కలశయాత్ర



**ఏలేశ్వరం ట్రైనెట్ న్యూస్, అక్టోబర్,15**
:ఏలేశ్వరం మండలం సి.రాయవరం గ్రామం 5వ వార్డులో కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా బుధవారం కలశపూజ, కలశయాత్ర ఘనంగా నిర్వహించారు. వరుసగా నాలుగో సంవత్సరం నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో అమ్మవారికి రోజుకో అలంకరణతో కుంకుమార్చన, మేళతాళాలతో ప్రత్యేకపూజలు చేస్తున్నారు.ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన కలశపూజలో సి.రాయవరం, రమణయ్యపేట, మార్కండేయపురం గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం వంద మందికి పైగా భక్తులు, భవానీలు కలశాలను ఎత్తుకుని కోలాహలంగా కలశయాత్ర నిర్వహించారు. పోలిమేర సత్తెమ్మ తల్లి ఆలయం వరకు వెళ్లి తిరిగి కనకదుర్గ ఆలయానికి చేరుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



# కల్పవృక్ష వాహనంపై బకాసుర వధ అలంకారంలో శ్రీ మలయప్పస్వామి కటాక్షం భక్తిభావంతో పరవశించిన తిరుమల.. భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక శోభ

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 15:**
తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం ఉదయంమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి బకాసుర వధ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గజరాజుల ముందు నడక, మంగళవాయిద్యాల నాదం, భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ప్రబంధ పారాయణం నడుమ వాహనసేవ వైభవంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులుసమర్పించిశ్రీవారి కృపాకటాక్షాలు పొందారు.

**కల్పవృక్ష వాహనం -- కోరిన కోర్కెలు తీర్చే దివ్య వైభవం**
క్షీరసాగర మథనంలో ఉద్భవించిన కల్పవృక్షం కోరిన ఫలాలను ప్రసాదించే దివ్య వృక్షంగా పురాణాలు పేర్కొంటాయి. అటువంటి కల్పవృక్ష వాహనంపై స్వామివారు దర్శనమివ్వడం భక్తులకు ఐహిక శుభాలు, సకలాభీష్టాల ప్రాప్తికి ప్రతీకగా



నిలుస్తుంది.

**రాత్రి సర్వభూపాల వాహనసేవ**
గురువారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీ మలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి సర్వభూపాలవాహనంపైభక్తులకుదర్శనమివ్వనున్నారు. ఈకార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ శ్రీ వెంకటేశ్వర్, అదనపు ఈవో శ్రీ సీహెచ్ వెంకయ్య










Edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA.
www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136